

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :21   సంచిక: 04   హైదరాబాద్   2021 జూలై   పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com**   వార్షిక సభ్యత్వం : రూ.100/-

# అరుదైన అవకాశం

మీ ప్రాంతాల్లో వున్న స్థానిక గ్రంథాలయ సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, ఆధ్యాత్మిక సంస్థలు, మెహెర్‌బాబా పత్రిక సభ్యత్వం తీసుకోవడానికి తగినంత ఆర్థికస్తోమత లేనివారు ఎవరైనా వుంటే అలాంటి వారి జాబితాలో అర్హత గల కొందరికి మెహెర్‌బాబా పత్రికను ఉచితంగా అందజేయాలని ప్రతిపాదించడమైనది. మెహెర్‌బాబా నామవ్యాప్తిలో భాగంగా, మెహెర్ సాహిత్యం పలువురికి అందజేయాలన్నదే ఈ ప్రతిపాదనలోని ప్రధాన ఉద్దేశ్యం. దయచేసి ఈ విషయమై స్థానిక బాబా ప్రేమికులు దృష్టి సారించి తగిన వివరాలను, వాట్సప్ నంబరు 99595 53218 త్వరలో పంపగలరు.

# పత్రికకు వాలంటీర్ల కోసం విజ్ఞప్తి

**ప్రతి జిల్లాలో మెహెర్‌బాబా పత్రికకు వాలంటీర్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల వారి నుండి తమ అంగీకారాన్ని తెలియజేయవల్సిందిగా కోరుతున్నాము. ఆసక్తిగల వారు తమ వివరాలను పత్రిక చిరునామాకు గాని లేదా వాట్సప్ నంబరు 9959553218 తెలియజేయవల్సిందిగా కోరుతున్నాము.**

# చల్లపల్లి కేంద్రం

కరోనా మహమ్మారి ఇంకనూ విజృంబిస్తున్న తరుణంలో జూన్ మాసంలో ప్రతి ఆదివారం ఉదయం 7 నుండి సా.7 వరకూ **"హరే మెహెర్, హరే మెహెర్"** ఏకనామస్మరణ కార్యక్రమం నిర్వహించాం. ఈ కార్యక్రమంలో స్థానిక బాబా ప్రేమికులు ఎవరి ఇళ్ళవద్ద వారే వుండి, ఒక్కొక్కరూ 30 నిముషాల చొప్పున నామస్మరణలో పాల్గొన్నారు. సాయంత్రం 7 గంటలకు అవతారుని ప్రార్థనలు, ఆరతితో కార్యక్రమం ముగించినట్లు కార్యదర్శి శ్రీ పివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 6.45 నిముషాలకు కేంద్ర అధ్యక్షులు శ్రీ చుండూరు మెహెర్ ప్రసాద్ గారింట బాబా ప్రార్థనలు చేసి, ఏకనామం కార్యక్రమం ప్రారంభించామని శ్రీ రమణారావు తెలిపారు.

## మెహెర్‌బాబా పత్రిక ఆన్‌లైన్‌లో

**www.srimeherbaba.com** సందర్శించండి!!

# బాబా సందేశం

**పరమాత్మను పరిపూర్ణంగా విశ్వసిస్తే,**
**నీ సమస్యలన్ని ఆయనే పరిష్కరిస్తాడు.**

**గౌరవ సంపాదకులు**
**డాక్టర్ మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

## మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | 2021 జూలై 10 | 6-7 |
| 3. | కన్హోబారావ్ గాదేకర్ | 8-11 |
| 4. | క్రొత్తవాళ్ళు!! | 12 |
| 5. | కుర్చీకా కహాని | 13-15 |
| 6. | బాబావారి జుత్తు | 16-17 |
| 7. | మా నాన్న స్మృతిపథంలో | 18-19 |
| 8. | లార్డ్ మెహెర్ | 20-27 |
| 9. | కొత్త పుస్తకాలు | 28 |
| 10. | మెహెరాబాద్ సహవాస్ | 29-32 |
| 11. | మౌన వార్షికోత్సవం | 33 |
| 12. | అవతారుని దివ్యప్రణాళిక | 34-37 |
| 13. | ప్రభుస్తుతి | 38 |
| 14. | పశ్చాత్తాప ప్రార్థన | 39 |

## మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

# వాట్సప్ - 99595 53218

మెహెర్‌బాబా పత్రికలో ప్రచురణార్థం మీరు పంపదల్చుకున్న సమాచారాన్ని వాట్సప్ నంబరు 99595 53218 ద్వారా పంపగలరు. మీ బంధు మిత్రులు అందరికీ బాబా సమాచారాన్ని అందజేయండి. పత్రికను ప్రతినెలా 20 తేది లోగా వాట్సప్ గ్రూప్‌లో పబ్లిష్ చేస్తున్నాం. ప్రతినెలా 25 లేదా 26 తేదీలలో పోస్టు చేస్తున్నాం. పత్రిక మీకు ప్రతినెలా 30వ తేదీలోగా బట్వాడా అవుతుంది.

## నాకు నచ్చిన శీర్షిక

సీనియర్, సూపర్ సీనియర్ సిటిజెన్స్...తమకు నచ్చిన అవతారుని ప్రేమ సందేశంతో కూడిన ఏదేని శీర్షికను మెహెర్‌బాబా పత్రికలో ప్రచురణార్థం పంపవల్సిందిగా కోరుతున్నాము. ఇందుకోసం మీరేమి ప్రత్యేకంగా కలంపట్టి రాయనవసరం లేదు. ఫోటో కాపీలు గట్రా తీయవల్సిన పనిలేదు. మీరు ఎంచుకున్న అంశాన్ని ఇంగ్లీషులో వుంటే దాన్ని తెలుగులో తర్జుమా కూడా చేయొద్దు. మీరు చేయవల్సిందల్లా....మీకు బాగా నచ్చిన, మీ మనస్సుని ఆకర్షించిన, మీరు చదివిన కథాంశాన్ని కేవలం ఫోటో తీసి మాకు వాట్సప్‌లో పంపండి. లార్డ్ మెహెర్ లాంటి గ్రంధాల్లో వున్న అంశాన్ని కూడా కేవలం ఫోటో తీసి వాట్సప్‌లో మాకు అందేలా పంపండి. వీలువెంబడి ప్రచురించి, మీతోపాటు మెహెర్‌బాబా పత్రిక పాఠకులందరితో మీకు నచ్చిన అంశాన్ని పాలుపంచుకుందాం!! ఇదే మా ఆశయం. **మా వాట్సప్ నంబర్ 995 955 3218.**

**ఒక గమనిక: ఇప్పటికే మెహెర్‌బాబా పత్రికలలో ప్రచురించిన శీర్షికలు కాకుండా అమూల్యమైన అరుదైన అంశాలను పంపుటకు ప్రాధాన్యత ఇవ్వవల్సిందిగా కోరుతున్నాం.**

## మెహెర్‌బాబా పత్రిక కోసం

**మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం**

1). శ్రీమతి పి. ఝాన్సీలక్ష్మి, జీడిమెట్ల, హైదరాబాద్, రూ.5000/-

2). డాక్టర్ జయసూర్య, హైదరాబాద్, రూ.1000/-

3). శ్రీ యం. జె. మోహన్‌రావ్, శ్రీమతి కమలమ్మ, బండ్లగూడ, రూ.1000/-

**విరాళంగా పంపారు. వీరందరికి మెహెర్‌బాబా పత్రిక పక్షాన ధన్యవాదములు. జైబాబా.**

సంపాదకీయం

# పుర్రెలో గలగల

"బాబా నీ దయ, కరుణ మాపై ప్రసరింపజేయి. మంచి ఆరోగ్యం, ఉద్యోగం, మంచి జీవితం ప్రసాదించు వంటి కోర్కెల చిట్టాతో ప్రార్థిస్తుంటారు. ఇది ప్రార్థన అవుతుందా? అని ప్రశ్నించారు బాబా. మీరు చూస్తున్న ఈ ప్రపంచం నిజం కాదు. ఇదంతా మిథ్య అని తెలుసుకున్నాక కూడా, ఇంకా మాకు అది కావాలి, ఇది కావాలని కోరుకోవడంలో అర్థమేమైనా వుందా? అని బాబా హెచ్చరించారు తన ప్రేమికుల్ని. ఆ పిదప ఓ కథని ఇచ్చి, ఏరుచ్‌ని చదవమన్నారు.

## బిక్షగాని గాథ

ఒక బిక్షగాడు స్థానికంగా ఊర్లో వున్న దేవుని గుడి ఎదుట కూర్చునేవాడు. గుడికి వచ్చీపోయే భక్తులు అడపాదడపా వేసే భిక్షతో జీవనం గడుపుతున్నాడు. అందులోనే కొంతభాగం రేపటి కోసం దాచిపెట్టుకున్నాడు. కొద్ది రోజులయ్యే సరికి ఆతను కూడబెట్టిన పైసలన్నీ కలిపితే నూరు పైసలయ్యాయి. దాంతో ఒక వెండి నాణెం ఖరీదు చేశాడు. ఇలా పైసాపైసా కూడపెడుతూ 25 వెండి నాణేలు కూడబెట్టేసరికి ఆతనికి వృధాప్యం వచ్చేసింది. ఇక ఎంతకాలమో బ్రతకననే విషయం తెలిసిపోయింది. తన జీవితాంతం కష్టించి సంపాదించిన ఆ నాణేలను తన తదనంతరం ఎవ్వరికీ చెందరాదనుకున్నాడు. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా, ఆ నాణేలన్నింటినీ ఒక్క గుటకలో మింగేశాడు. ఆ ప్రయత్నం వికటించింది. నాణేలు మింగుడు పడక, గొంతులోనే అడ్డంపడి, ఊపిరాడక ప్రాణాలొదిలేశాడు. ఏమైతేనేమి! బిక్షగాడు ఆశించినట్లు ఆతని సంపాదన ఎవ్వరికీ చిక్కలేదనుకోవద్దు. ఆ పిదప, ఆ అనాథ శవాన్ని స్థానిక మున్సిపాలిటీవాళ్ళు తూతూమంత్రంగా ఖననం చేశారు. ఆ కళేబరాన్ని అనేక జంతువులు ఇష్టమొచ్చినట్లు పీక్కుతిన్నాయి. తల భాగం పుర్రెతో పాటు, శరీరంలోని ఎముకలన్నీ చెల్లాచెదరైనాయి. ఒకరోజున ఆ దారినపోయే స్కూలుపిల్లలకు గలగలా చప్పుడు చేస్తూన్న **"ఆ పుర్రె"** వారి కాలికి తగిలింది. దాంతో వారు చాలాసేపు ఆ పుర్రెతో ఆడుకుని, పుర్రె లోపల **"గల గలను"** బయటకు తీయాలని పెద్ద బండరాళ్ళతో కొట్టారు. వృద్ధుడు చనిపోతూ మింగిన నాణేలు పళ్ళ బిగువున వుండిపోయాయి. ఆ పుర్రెను బ్రద్దలుకొడితే వెండి నాణేలు బయటపడ్డాయి.

ఆగర్భ శ్రీమంతుడికైనా!! దమ్మిడి లేని బిక్షగాడి విషయంలోనైనా శరీరం వదిలాక జరిగేది ఇంతేనని, నర్మగర్భంగా బాబా చెప్పారు ఈ కథలో. అంతేగా మరి!!

***

# 2021 జూలై 10

మెహెర్‌బాబా ప్రేమికులందరికీ 2021 జూలై 10 చాలా పవిత్రమైన రోజు. 1925 జూలై 10 నుండి బాబా మౌనం ప్రారంభించారు. ఆ రోజున బాబా ప్రేమికులు వారెక్కడున్నా బాబా నామం స్మరిస్తూ మౌనం పాటిస్తారు. ఇది బాబా తన ప్రేమికులకు ఇచ్చిన ఆదేశం. గత కొన్నేళ్ళుగా చాలామంది బాబా ప్రేమికులు ప్రతి ఏడాది జూలై 10 నాటికి బాబా సమక్షంలో గడిపేలా, బాబా సమాధివున్న అహ్మద్‌నగర్ జిల్లాలోని మెహెరాబాద్‌కు వెళ్తున్నారు. ఐతే, ఈ ఏడాది కరోనా సమస్య వల్ల, బాబా ప్రేమికులెవర్నీ మెహెరాబాద్‌కు రావద్దని బాబా ట్రస్టు ముందుగానే ఒక ప్రకటనలో హెచ్చరించారు. బాబా ప్రేమికులు ఎక్కడున్నవారు అక్కడే వుండి బాబా నామస్మరణలో మౌనం పాటించాలని సూచించారు. మెహెర్‌బాబా మౌనం పాటించేనాటికి ఆయన వయస్సు 30 సంవత్సరాలు. ఆ రోజుల్లో మెహెర్‌బాబా ఎదుటివారు సమ్మోహితులయ్యేలా చమత్కారంగా మాట్లాడేవారు. స్వయంగా డోలక్ వాయిస్తూ, అద్భుతంగా ఘజల్సు గానం చేసేవారు. అనర్గళంగా ఆయన చెప్పే అనేక ఆధ్యాత్మిక విషయాలు వినడానికి ఎందరో బాబా చుట్టూచేరి కూర్చుని శ్రద్ధగా ఆలకించేవారు. ఐతే, 1925వ సంవత్సరం తొలినాళ్ళనుండీ, బాబా తన సన్నిహితులతో త్వరలో తాను మౌనం ప్రారంభించనున్నానని అనేకమార్లు ప్రకటించారు. బాబా చేసే ఈ ప్రకటనలోని మర్మం ఆయన శిష్యులకేమి బోధపడలేదు. ఒకసారి ఇలా బాబా తన మౌనం గురించి చెప్తుంటే, “బాబా నీవు మౌనం పాటిస్తే, నీవు నిత్యం చెప్తున్న అనేక ఆధ్యాత్మిక మర్మాలు ఎవరు చెప్తారు. దయచేసి మౌనం పాటించవద్దని” ఆయన శిష్యులు ప్రాధేయపడ్డారు. అందుకు “నేను బోధించుటకు రాలేదు. మేల్కొల్పుటకు వచ్చానని” బాబా ప్రకటించారు. ఆ తర్వాత, ముందుగానే ప్రకటించినట్లు బాబా తన మౌనం 1925 జూలై 10న ప్రారంభించారు. ఆనాటి నుండి సుమారు 44 సంవత్సరాలు, బాబా తన భౌతిక శరీరం త్యాగం చేసే దాకా అంటే 1969 జనవరి 31 దాకా మౌనంలోనే వున్నారు. మౌనంగానే బాబా 13సార్లు విదేశీ ప్రయాణాలు చేశారు. మనదేశంలో ఆశేతు హిమాచలం అన్నట్లు సుమారు 72 వేల కిలో మీటర్లు ప్రయాణించారు. రవాణా వ్యవస్థ అంతంతమాత్రంగా వున్న ఆ రోజుల్లో బాబా పలు సందర్భాలలో కాలినడకన, ఎద్దులబండ్లలో కూడా పర్యటించారు. 1940 నుండి ఓ దశాబ్ద కాలం పైగా మస్తులనే భగవదోన్మత్తులతో సాంగత్యం కోసం అనేక మారుమూల ప్రదేశాలను సందర్శించారు. మౌనంలోనే మెహెర్‌బాబా భగవద్వచనం, సర్వం-శూన్యం, అనేక ప్రవచనాలు గ్రంధస్తం చేశారు. బాబా తన మౌనం గురించి పలు సందర్భాలలో ప్రస్తావిస్తూ, “నేనెప్పుడూ మౌనంగా

లేను. నా ప్రేమికుల హృదయాంతరాలతో నిరంతరం మాట్లాడుతూనే వున్నానన్నారు". ఇది బాబా ప్రేమికులందరికీ నిత్యం అనుభవైక్యమే!!

## రెండుసార్లు కారు ప్రమాదాలు

1952 మే 24న అమెరికాలో మెహెర్‌బాబా కారులో ప్రయాణిస్తుండగా ఘోర కారు ప్రమాదం జరిగింది. తిరిగి 1956 డిశెంబరు 2న, సతారా పట్టణ సమీపంలో మరోసారి కారు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బాబా కాలికి, తుంటికి ఫ్రాక్చరయింది. ఈ సమయంలో కూడా బాబా అమితమైన బాధను మౌనంగా అనుభవించారని ఆనాడు అవతారుడికి వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు వెల్లడించారు. సాధారణ మానవులు మౌనంగా ఇంతటి బాధను భరించలేరని డాక్టర్లు అభిప్రాయపడ్డారు. 1925 నుంచి 1954 దాకా అక్షరఫలకం సహాయంతో బాబా తన మౌనం కొనసాగించారు. ఆపై అక్షరఫలకం కూడా వదలి, కేవలం సంజ్ఞలతో తన సందేశాలు ఇచ్చారు.

## మహాత్మా గాంధీ సయుతం

ఐతే బాబా మౌనం ఎందుకు ప్రారంభించారు. ఎప్పుడు మౌన విరమణ చేస్తారు. ఇలా బాబా మౌనంకు సంబంధించి ఎందరో అవతారుడినే నేరుగా ప్రశ్నించారు. బాబా యూరోపు, అమెరికా పర్యటనలలో వున్న సమయంలో, అలాగే మన దేశంలో కూడా ఎందరో పత్రికా విలేఖర్లు బాబా మౌనం ఎందుకు చేపట్టారని, మౌనవిరమణ ఎప్పుడు చేస్తారని గుచ్చి గుచ్చి ప్రశ్నించిన సందర్భాలు అనేకం వున్నాయి. మెహెర్‌బాబా రాజపుతానా ఓడలో లండన్ పర్యటనకై వెళ్ళిన సమయంలో, అదే ఓడలో ప్రయాణిస్తున్న మహాత్మా గాంధీజీ మెహెర్‌బాబాతో పలుమార్లు సమావేశమయ్యారు. గాంధీజీ కూడా బాబాతో మాట్లాడుతూ –"మీ సుమధుర వాక్కులు వినాలని వుంది. మౌన విరమణ ఎప్పుడు చేస్తారు. మీ మాట వినాలన్న ఆతృత పెరుగుతోంది రోజు రోజుకి. పెదవి కదపకుండనే ప్రజలని మీరెంతగానో ప్రభావితులని చేస్తున్నారు. మీరు పెదవి విప్పి, మౌన విరమణ చేస్తే, ప్రజలు ఎంతగా ప్రభావితులవుతారో? మీరు త్వరలో మాట్లాడాలని గాంధీ బాబాని కోరారు. అంతేకాదు, ఆ దరిమిలా గాంధీజీ కూడా వారంలో ఒకరోజున మౌనం పాటించడం ప్రారంభించారు. ఐతే అవతారుడు ఎన్నడూ మౌనంగా లేడని, పిలిస్తే పలుకుతాడని ఆయన ప్రేమికులంటారు. బాబా ప్రతిక్షణం తమతోనే, తమవెన్నంటి వున్నాడన్న అనుభూతి తమకుందంటారు. **మెహెర్‌బాబా యావత్తు మానవాళి కోసం 1958 జూలై 10, గురువారం మౌన వార్షికోత్సవం రోజున "విశ్వ సందేశం" మెహెరాబాద్‌లో ప్రకటించారు.** మెహెర్‌బాబా మౌనం విశ్వకళ్యాణం కోసం చేపట్టారు.

నాకు నచ్చిన శిక్ష

అవతారుడికి పాదరక్షలు అందించిన

# కన్హోబారావ్ గాడేకర్

(శ్రీ వల్లూరి నాగేశ్వరరావు, విశాఖ)



ఆతని పేరు కన్హోబారావ్ గాడేకర్. అహ్మద్‌నగర్‌లో ఒక చెట్టు క్రింద కూర్చొని చెప్పులు కుట్టుకునేవాడు. ఒక నిరుపేద హరిజనుడు. అతను కడు పేదవాడేమో కాని గొప్ప దైవ భక్తుడు. తీరిక చిక్కినప్పుడలా దేవుని నామస్మరణలో వుండటం ఆతని అలవాటు.

ఒకరోజున ఆతను చెప్పులు కుడుతుండగా బాబా ప్రేమికురాలైన గుల్మాయి వచ్చింది. ఆమె బాబా కోసం ఒక చెప్పుల జత కుట్టించాలని ఆతని దగ్గరకు వచ్చింది. గుల్మాయిని చూస్తూనే ఆతను లేచి నిలబడి దగ్గర్లోనే వున్న ఒక బల్లపై ఆమెని కూర్చోమని గౌరవంగా చెప్పాడు. నీవు నిత్యం భగవన్నామస్మరణలో గడుపుతావ్ కదా!! అని గుల్మాయి ఆతడ్ని అడిగింది. విఠల్ నామస్మరణ చేసుకుంటూ ఈ తోలు చెప్పులు కుట్టుకుంటానని జవాబిచ్చాడు గాడేకర్. విఠల్ నామస్మరణలోనే నాకెంతో ఆనందం లభిస్తుందమ్మా అని అన్నాడు. నీవు ప్రేమిస్తున్న ఆ విఠల్ నాథుడే మరలా ఈ భూమ్మీద మెహెర్‌బాబాగా అవతరించాడయ్యా!! ఆ స్వామి పాదాలకు నీ చేతితో కుట్టిన చెప్పులను యివ్వాలయ్యా అని గుల్మాయి కోరింది. తప్పకుండా కుట్టిస్తానంటూ ఆ స్వామికి నేను కుట్టిన చెప్పులు నచ్చుతాయంటావా తల్లి? అని అనుమానం వ్యక్తం చేశాడు గాడేకర్. నేనేదో పొట్ట కూటి కోసం చేసుకుంటున్నాను ఈ పనిని. అంతటి మహాత్ములకు నేను కుట్టే చెప్పులు నచ్చుతాయా అమ్మా? అని మరలా తన సందేహం వెలిబుచ్చాడు. నీవు ఆరాధించే విఠల్ నాథుడే మెహెర్‌బాబా అని చెప్పాను కదా అంటూ, నీవు కుట్టే చెప్పులు బాబాకు తప్పక నచ్చుతాయి. ప్రేమ వున్న చోట అంతా సాధ్యమౌతుంది. ఆయన పాదాలకు చెప్పులు కుట్టే అవకాశం బాబానే నీకు యిచ్చాడయ్యా అని, గుల్మాయి త్వరగా తయారుచేసి ఇవ్వమని అడిగింది.



హే! విఠల్ నాథ!! నా మనసులో నీవుండి ఈ చెప్పులనుకుట్టించుకో. ఈ చెప్పులను విడిచిపెట్టకుండా అనుక్షణం నీవు తొడుక్కోవాలి స్వామి, అదే ఈ పేద గాడేకర్ ప్రార్థన అని పని ప్రారంభించాడు. ఆ సమయంలో బాబా పూణేలో ఫెర్గూసన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఆశ్రమంలో ఉంటున్నారు. ఆ దారిన వచ్చీపోయే వారితో ఈ ప్రాంతం చాలా సందడిగా వుండేది. పగటిపూట దగ్గర్లోని చెట్టు క్రింద నీడలో కూర్చుని, తన కొరకు వచ్చే వారికి దర్శనమిచ్చే వారు బాబా. ఆయన శిష్యులు భజన గీతాలు పాడుతుండేవారు. బాబా అనేక ఆధ్యాత్మిక విషయాలు వారికి చెప్పేవారు. ఇదిలావుండగా, ఒకరోజున గాడేకర్ కుట్టిన తోలు చెప్పులు తీసుకుని గుల్మాయి బాబావారి పూణే ఆశ్రమానికి వచ్చింది. బాబా ఆమెని చూసి చాలా సంతోషించారు. ఆమె ప్రయాణం ఎలా జరిగింది వంటి కుశల ప్రశ్నలు అడిగారు. ఆ తర్వాత తనతో తెచ్చిన చెప్పులను బాబాకి ఇవ్వగానే ఆయన పరమానందభరితుడయ్యారు. బాబా వాటిని తొడుక్కుని ఎంతో ఆనందంగా అటు – యిటు తిరిగారు. చాలా బాగున్నాయి అన్నారు. ఎంతో ప్రేమతో నన్ను స్మరిస్తూ కుట్టిన ఈ చెప్పులు నాకెంతో నచ్చాయి. సరిగ్గా సరిపోయాయి. చాలా బాగున్నాయని, ఆ చెప్పులను క్షణమైనా విడిచిపెట్టకుండా తొడుక్కొనే ఉంటానన్నారు. ఈ విషయం ఆతనితో చెప్పమన్నారు గుల్మాయిని. బాబా! నీవు సర్వజ్ఞుడవు. అందరి హృదయాలను ఎరిగిన వాడవు. నీ పాదాల సైజు కూడా తెలియని గాడేకర్ నీ నామస్మరణ చేస్తూ ఈ చెప్పుల్ని ఎంతో ప్రేమతో కుట్టి యిచ్చాడని ఆమె చెప్పింది. గాడేకర్ ఎంతో అదృష్టవంతుడని, ధన్యజీవని గుల్మాయి తనలో తాను అనుకుంది. ఆ దరిమిలా, ఒకరోజున బాబా స్వయంగా అహ్మద్‌నగర్‌లో వుంటున్న కన్హోబారావ్ గాడేకర్ యింటికి వెళ్ళారు. బాబాను చూడగానే గాడేకర్ ఆనందానికి అవధులులేవు. కన్నీరు మున్నీరై విలపించాడు. అంటరాని వాడినైన మా యింటికి వచ్చావా స్వామి అంటూ ఆనందంతో తన భార్య, పిల్లవాడు రామచంద్ర గాడేకర్‌లను బాబా పాదాలకు ప్రణమిల్లమని చెప్పాడు. నీవు కుట్టిన చెప్పులు నాకెంతో నచ్చాయి. వాటిని విడవకుండా వాడుతున్నాను. "నాపై నీకున్న ప్రేమ నీ యింటి వరకు నన్ను రప్పించిందని", బాబా గాడేకర్‌తో అన్నారు. అస్పృశ్యులుగా మిగిలివున్న మాకు నీ కరుణ చూపి మమ్మల్ని నీ దరిజేర్చినావు. అంతకన్నా ఏమి

కావాలి ప్రభూ!! అని గాడేకర్ బాబాతో అన్నాడు. మీరు అస్పృశ్యులు కారు. మీరంతా దేవుని బిడ్డలు. మీలో వున్న ఆ దేవదేవుడే నన్ను మీ యింటికి తీసుకువచ్చాడు. బాధపడకు. రానున్న కాలంలో మీరంతా గొప్పవారవుతారన్నారు. దేవున్ని ప్రేమించలేనివారే నిజమయిన అస్పృశ్యులని అంటూ గాడేకర్‌ని బాబా తన దగ్గరగా తీసుకుని ఆలింగనం ఇచ్చారు. గాడేకర్ కుమారుడు రామచంద్ర గాడేకర్‌ను "నీకేమి కావాలి"? అని బాబా అడిగితే, "బాగా చదువుకుంటానని" జవాబిచ్చాడతను. అతని చదువుకయ్యే ఖర్చునంతా తాను భరిస్తానన్నారు బాబా. బాగా చదువుకోమని దీవించారు. ఆ దరిమిలా కన్హోబరావు, ఆయన కుమారుడు రామచంద్ర గాడేకర్, తిరిగి ఆయన కుమారుడు దిగంబర్ గాడేకర్‌లు మూడు తరాలుగా బాబా ప్రేమకి, సేవకి ఎంతగా అంకితమయ్యారో పాఠకులకు తెలుసు. బాబా పాదరక్షలకి సంబంధించి ఒక చక్కని వాస్తవ కథనం ఇలావుంది. దయచేసి పరిశీలించండి

## గాబ్రియల్ పాస్కల్ - బాబా ఇచ్చిన బహుమతి

అమెరికా దేశీయుడు. గాబ్రియల్ పాస్కల్. ఆతను ఒక ప్రసిద్ధ సినీ దర్శకుడు. 1934 బాబా యూరోపు పర్యటనకు వెళ్ళినప్పుడు, బాబాని తొలిసారిగా స్విట్జర్లాండులో దర్శించుకున్నాడు. ఆ తర్వాత మెహెర్‌బాబా ఫిల్మ్ తీద్దామని మెహెరాబాద్‌కి వచ్చాడు. కానీ ఏకారణంగానో, ఆ సినిమా గురించి ఆతను ఏమీ ఆలోచన చేయలేదు. కానీ బాబావారి సాన్నిధ్యంలో మెహెరాబాద్‌లో చాలారోజులు వున్నాడు. ఎన్నో అనుభూతులు చవిచూశాడు. బాబా ప్రేమని పొందిన ధన్యుడు. అలా ఆతను ఒక సంవత్సరకాలం బాబా సన్నిధిలో వున్నాడు. చివరకు అతడు బాబా దగ్గర సెలవు తీసుకొని అమెరికాకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఆతని మీదున్న ప్రేమతో బాబా తన వీడ్కోలు బహుమతిగా తన పాదరక్షల్ని ఆతనికి ఇచ్చారు. బాగా అరిగిపోయిన తోలు చెప్పులవి. అలాగే, ఒక పాత సూటేకేస్ కూడా పాస్కల్‌కి బాబా తన బహుమతిగా యిచ్చారు. అవి పట్టుకొని అమెరికాకు ఓడలో బయలుదేరి మధ్యలో శాన్‌ఫ్రాన్సిస్కోలో దిగాడు. పాస్కల్ తన జీవితంలో డబ్బు బాగానే గడించాడు. అదే సమయంలో బాగా ఖర్చు కూడా చేశాడు. ఒక విధంగా చెప్పాలంటే పాస్కల్ జోర్‌దార్ దిల్ గలవాడనాలి. శాన్‌ఫ్రాన్సిస్కోలో కల్లా అతి ఖరీదైన **"సెయింట్ ఫ్రాన్సిస్ హొటల్లో"** గది నొకదాన్ని అద్దెకు తీసుకన్నాడు. కొన్నాళ్ళు తర్వాత హాలీవుడ్ వెళ్ళి డబ్బు సంపాదించాలని నిశ్చయించుకున్నాడు. ఐతే ముందు హొటలు బిల్లు కట్టి కదలమన్నాడు హొటలు మేనేజర్. బిల్లు కట్టడానికి అతని దగ్గర చిల్లి గవ్వలేదు. ఏమి చేయాలో ఆలోచిస్తూ ఆ హొటల్ మేనేజర్‌కి తన సంగతి అంతా చెప్పి, బిల్లు కట్టడానికి కొంత టైం కావాలని అడిగాడు. అందుకు ఆతను ఒప్పుకోడు. బిల్లు కట్టి కదలమన్నాడు. ప్రస్తుతం తన దగ్గర డబ్బులేదు. నన్ను నమ్ము. నన్ను అర్థం చేసుకో.

త్వరలోనే డబ్బు సంపాదించి, నీ హొటల్ బిల్లు అణాపైసలతోసహా చెల్లిస్తానని చెప్పాడు. ఐతే ఆతని వేదన చెవిటివాని ముందు శంఖువూదినట్లైంది. ఎంత చెప్పినా ఆతను అంగీకరించ లేదు. హొటలు బిల్లు కట్టి ముందుకు కదలమన్నాడు. బిల్లు చెల్లించ లేకపోతే ప్రత్యామ్నాయంగా ఏదైనా కుదవ పెట్టమన్నాడు. నీ సూట్‌కేసుని వదలిపెట్టి వెళ్ళమన్నాడు. బాబా యిచ్చిన పాత సూటుకేస్, అందులో వున్న పాత చెప్పులు జత తీసి, వీటిని నీ దగ్గర వుంచుకో. ఇవి ఎంతో విలువైనవి. ఇవి కొన్ని మిలియన్ల డాలర్లు ఖరీదు చేస్తాయి. ఇవి నీ దగ్గర ఉండటం వల్ల నీ అదృష్టం మారొచ్చు కూడా. కాలం కలిసి రావచ్చు. నీకెంతో లాభం చేకూరుతుంది. భారతదేశంలో వున్న ఒక దివ్య పురుషుడు నా అదృష్టం కొద్దీ వీటిని నాకు బహుకరించాడు. కాబట్టి, వీటిని కొద్దిరోజులు నీ దగ్గరుంచుకుని, నీ అదృష్టాన్ని పరీక్షించుకో!! ఈలోగా నేను వెళ్ళి డబ్బును సంపాదించుకుని, మీ బాకీ తీరుస్తానని ఒప్పించాడు. ఏమైతేనేమి హొటలు మేనేజరు కొంతసేపు తటపటాయించి చివరాఖరుకి ఒప్పుకున్నాడు. పాస్కల్ గది ఖాళీ చేశాడు. ఆ దరిమిలా తగినంత డబ్బు సంపాదించుకని, బాబావారిచ్చిన పాదరక్షలు, సూట్‌కేస్ తీసుకుందామని శాన్‌ఫ్రాన్సిస్‌కో హొటల్‌కు తిరిగి వచ్చాడు. కానీ అక్కడ హొటల్‌లో పాత మేనేజర్ లేదు. అతని కోసం వాకబు చేయగా, అతనొక లక్షాధికారయ్యాడని తెలుస్తుంది. ఒక పెద్ద కంపెనీలో పార్ట్‌నర్‌షిప్ కూడా పొందాడనీ చెప్పారు. ఆ తర్వాత ఆతడ్ని కలిసి, తన బాకీ డబ్బులు తీసుకొని కుదవపెట్టిన బాబావారి పాదరక్షలు, సూట్‌కేస్ తిరిగి తనకిచ్చేయమన్నాడు. కానీ అందుకు ఆ మేనేజరు ఒప్పుకోలేదు. అదేమిటి! హొటల్ బిల్లు కట్టలేక తాత్కాలికంగా వాటిని మీ దగ్గరుంచాను. యిప్పుడు తిరిగి ఇవ్వనంటే ఎలా? నేనిప్పుడు డబ్బు తీసుకొచ్చాను. దాన్ని తీసుకొని నా వస్తువులు దయచేసి వాపను ఇవ్వండని పాస్కల్ కొంచెం గట్టిగానే అడిగాడు. ఐతే, ఆ వస్తువులు నాకు అదృష్టాన్ని తెచ్చిపెట్టాయి. మీరేమిచ్చానా వాటిని మీకు తిరిగి ఇవ్వనని ఖరాఖండిగా చెప్పాడు – మేనేజర్. ఈ రోజు తాను ఇలా వుండటానికి కారణం ఆ పాదరక్షలే అనీ అన్నాడు. పాస్కల్ తాను చెల్లించాల్సిన బాకీని తీర్చడమే కాకుండా, దానిపై వడ్డీ కూడా చెల్లిస్తానన్నాడు. ఆ వస్తువులు తనకు ప్రాణప్రదం, అని పాస్కల్ బ్రతిమలాడాడు. ఎంత చెప్పినా, ఏమన్నా ఆతను బాబా పాదరక్షలు ఇవ్వడానికి ససేమిరా ఒప్పుకోలేదు. చివరాఖరున, ఆ వస్తువుల్ని కనీసం ఒకసారి చూపించమని వేడుకున్నాడు. ఆ మేనేజర్ తన ఇంట్లో బాబా పాదరక్షల్ని ఒక బంగారు పళ్ళెంలోపెట్టి, భక్తిపూర్వకంగా భద్రపరిచాడు. ప్రతిరోజూ భక్తితో ఆరాధిస్తున్నానని చెప్పాడు. కన్నీటి పర్యంతమైన పాస్కల్, దైవీమానవుని పాదరక్షల్ని పోగొట్టుకున్నానని బాధతో వెనుతిరిగాడు. తన అదృష్టం అంతవరకేనని తృప్తిచెందాడు పాస్కల్.

నాకు నచ్చిన శీర్షిక

# క్రొత్తవాళ్ళు!! స్ట్రేంజర్సు ??

**(శ్రీమతి యస్.యస్. లక్ష్మి, కాకినాడ)**



ఆయనికి క్రొత్తవారంటే వల్లమాలిన సిగ్గు. క్రొత్తవాళ్ళు వుంటే ఆయన ఆ దరిదాపులకు కూడా రాడట. ఇంతకీ ఎవరాయన? ఆయన మరెవరో కాదు. సాక్షాత్తూ భగవంతుడు. భగవంతుడికి క్రొత్త-పాతవాళ్ళనే భావం ఏమిటి? అని అనిపించొచ్చు. కానీ, భగవంతుడు వున్నాడు అనే నమ్మేటువంటి ఆస్తికులకి, ఆ దేవదేవుడిని ఎలా పొందాలనే విషయమై **THE EVERYTHING AND THE NOTHING** గ్రంథంలో బాబా ఇలా చెప్పారు.(ఈ గ్రంధాన్ని తెలుగులో **'సర్వం -శూన్యం'** పేరిట అనువదించారు). "భగవంతుడి కోసం నీవెక్కడా వెదకాల్సిన పనిలేదు. ఆయన నీలోనే వున్నాడు. నీ హృదయమే ఆయన గర్భాలయం.ఐతే, ఆయన ఉండే నీ హృదయంలో ఉండనీయకుండా, కనీసం ఆయన లోపలకు రాకుండా ఎందరో క్రొత్తవారితో (స్ట్రేంజర్సు) నింపివేశావు. దేవునికి క్రొత్తవారంటే ఇష్టం వుండదు. సరికదా, వారిని చూసి ఆయన సిగ్గుపడతాడని బాబా చమత్కరించారు. నీ హృదయాన్ని ఆక్రమించిన ఆ క్రొత్తవాళ్ళనందరినీ బయటకి తరిమేస్తే కానీ, భగవంతుడు నీ దరి చేరడని బాబా స్పష్టం చేశారు. ఇంతకీ ఎవరీ స్ట్రేంజర్సు?? వారెవరో కాదు. నీ అనంతమైన కోర్కెల సమాహారమే.ఆ కోర్కెలు నీ హృదయంలో గూడు కట్టుకున్నంత కాలం భగవంతుడు తన స్థానాన్ని ఆశ్రయించదు. అందరితో స్వచ్ఛంగా, నిజాయితీతో నడుచు కోవడం ద్వారా నీ హృదయం పరిశుద్ధమౌతుంది. ఆ దరిమిలా, నీ హృదయం నుండి ఆ కొత్తవాళ్ళందరూ దూరమౌతారు. ఆ దేవదేవుడు నీ దరి చేరతాడు. నీలో వున్న ఆయన్ని దర్శించుకోగల్గుతావు. గుర్తించగల్గుతావు. సంతుష్టుడివి కాగల్గుతావని బాబా చాలా స్పష్టంగా, సరళంగా వ్యాఖ్యానించారు. **ఇది అవతారుని ఉవాచ.** బాబావారి ప్రవచనాలను ఆచరణలో అమలుచేసే ప్రయత్నం చేద్దాం!!

***

## కుర్చీకా కహాని

# మెహెరాజాద్‌లో బాబాగదిలో కుర్చీ

**గత సంచికలో బాబా ప్రేమికుడు డాక్టర్ హారి కెన్‌మోర్, న్యూయార్క్, అమెరికా గురించి తెలుసుకున్నాం. డాక్టర్ హారి చెప్పిన వాస్తవ సంఘటన ఇది. ఆసక్తికరమైన ఈ శీర్షికను దయచేసి పరిశీలించండి.** ఇకపై డాక్టర్ హారి మాటల్లోనే!!

***




**నేను** బాబా కోసం ఒక రిక్లైనర్ కుర్చీ కొందామని నా క్లినిక్‌లో పనిచేసే నా సెక్రటరీతో కలిసి న్యూయార్క్‌లో వున్న చాలా ఫర్నిచర్ షాపులకు వెళ్ళాను. నా సెక్రటరీ కూడా బాబావారంత ఎత్తులో వుంటుంది. అందుకని బాబాకు అనువైన కుర్చీని వెదుకుతూ ఒక షాపులో, ఒక రిక్లైనర్ కుర్చీని ఎంపిక చేశాను. ఈ రిక్లైనర్ కుర్చీ విశేషం ఏమంటే అవసరమనుకుంటే కాళ్ళు జాపుకునేలా ముందుకు లేదా వెనక్కి జరుపుకోవచ్చు. అప్పట్లో బాబా కారు ప్రమాదానికి గురై చికిత్స తీసుకుంటున్న రోజులవి. 1956 డిశెంబరు 2న సతారాలో కారు ప్రమాదానికి గురైన విషయం పాఠకులకు తెలుసుకదా. బాబా ఇలాంటి కుర్చీలో కూర్చొని సేదతీరొచ్చన్న ఉద్దేశ్యంతో నేను ఈ కుర్చీని బాబాకు ఒక సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా ఇద్దామని న్యూయార్క్‌లో కొని, ప్యాక్ చేయించాను. నేను పూణే వెళ్ళే రోజున ఆ కుర్చీని నాతోపాటు తీసుకెళ్ళేలా విమానంలో ఎక్కించమని వారిని కోరాను. షాపువాళ్ళు ఆ మాదిరిగానే చేశారు.

ఆ రోజు నేను న్యూయార్క్ నుండి ముంబాయి విమానం ఎక్కుతుంటే స్థానిక బాబా ప్రేమికులు చాలామంది విమానాశ్రయానికి వచ్చారు. బాబా కోసం ఖరీదు చేసిన కుర్చీని, చాలా జాగ్రత్తగా నేను ప్రయాణించే విమానంలోనే వచ్చేలా జాగ్రత్త తీసుకున్నారు.

## ఐతే ఏమయిందనుకున్నారు.

హతవిధీ!! అని నిట్టూర్చాల్సిన పరిస్థితి ఎదురైంది. ఒట్టి చేతులతో పూణేలోని గురుప్రసాద్‌లో వున్న బాబా దగ్గరకు వెళ్ళాల్సి వచ్చింది. జరిగిందేమంటే, నాతో పాటు అదే విమానంలో ఎంతో జాగ్రత్తగా ఎక్కించిన కుర్చీ ముంబాయిలో దిగలేదు. కారణం తెలియదు. ఎయిర్‌పోర్ట్ వాళ్ళతో మాట్లాడితే, ఆ కుర్చీ గురించి వాకబు చేస్తామని, తప్పక ఏ విషయం త్వరలో చెప్తామని హామీ ఇచ్చారు. దాంతో ఒట్టి చేతులతో పూణే బయల్దేరాను. ఆ మర్నాడు తెలిసిన విషయం ఏమంటే, ఆ కుర్చీని బొంబాయి విమానాశ్రయంలో దించుకోవడంలో ఏదో పొరపాటు జరిగింది. తత్ఫలితంగా థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌కి వెళ్ళిందని చెప్పారు. నాతో తీసుకొచ్చిన సర్‌ప్రైజ్ గిఫ్ట్ గురించి బాబాకి చెప్పాను. కానీ తానొకటి తలిస్తే దైవం మరోలా చేశాడని, జరిగినదంతా బాబాకి చెప్పి బాధపడ్డాను. బాబా బాధపడొద్దన్నారు. రెండ్రోజుల తర్వాత ముంబాయి ఎయిర్‌పోర్ట్ వాళ్ళు కుర్చీ వచ్చింది, తీసుకెళ్ళమని ఫోన్ చేశారు. దాంతో సంతోషంగా నేనూ, మెహెర్‌జీ ముంబాయికి బయల్దేరాం. కుర్చీని తీసుకురావడానికై పూణే నుండి మాతో ఒక టెంపో ట్రక్కుని కూడా అద్దెకు తీసుకెళ్ళాం. కుర్చీని ట్రక్కులో పెట్టుకునే సమయంలో తిరిగి పెద్ద సంకటస్థితి ఎదురైంది. ఆ కుర్చీకి **"కస్టమ్స్ డ్యూటీ కట్టి"** తీసుకెళ్ళమని అధికారులు హుకుం జారీచేశారు. నా కోపం నషాళాన్ని తాకింది. నేను చాలా రఫ్‌గా వుంటానంటారు. నాకు కోపం వస్తే నేనెలా ప్రవర్తిస్తానో బాబా ప్రేమికులందరికీ తెలుసు. కొద్దిసేపు మౌనం రాజ్యమేలింది. చాలా హడావిడి చేశాను. కస్టమ్స్ అధికారితో గట్టిగా వాదులాటకు దిగాను. వాళ్ళు చేసిన నిర్వాకానికి ఇంకా డ్యూటీ కూడా కట్టాలా? అని పచ్చి గ్రాంధికంలో ఎదురుప్రశ్న వేశాను. **"ఈ కుర్చీని నా తండ్రికి సర్‌ప్రైజ్ గిఫ్ట్‌గా ఇద్దామని తీసుకొచ్చాను. నా ఆశపై మీరు నీళ్ళు జల్లారు. నా కోరికను సర్వనాశనం చేశారు. మీరేమనుకుంటున్నారు. అవతారుడు ఈ గడ్డపై జన్మించి వుండకపోతే, నాబోటివాళ్ళు ఈ దేశానికి వస్తారా? అని గద్దించాను. నా స్వరం ఎయిర్‌పోర్టులో ప్రతిధ్వనించింది. ఇంతా జరిగాక, పుండుమీద కారం జల్లినట్లు, ఈ అవమానం చాలదన్నట్లు కస్టమ్స్ డ్యూటీ కూడా కట్టాలని ఒత్తిడి చేస్తారా?** అంటూ బిగ్గరగా అరిచాను. దాంతో అక్కడివారందరూ వారి పనులన్నీ ప్రక్కనపెట్టి

సినిమా చూసినట్లు స్తంభించిపోయారని నాతో వచ్చిన మెహెర్‌జీ ఆ తర్వాత మాతో చెప్పాడు. మెహెర్‌జీ ఇంకా ఇలా అన్నాడు. నేను ఒక పెద్ద సింహంలా ఘీంకరిస్తుంటే విమానాశ్రయం నా స్వరంతో దద్దరిల్లిపోయిందన్నాడు. అక్కడున్న అధికారులు భీతిల్లిపోయారని అన్నాడు. ఈ విషయంలో తాను కలగజేసుకోలేక, స్థాణువులా మౌనంగా వుండిపోయానన్నాడు. నా స్వరం సహజంగానే గంభీరంగా వుంటుంది. బిగ్గరగా మాట్లాడుతుంటే సింహం జూలువిదిల్చినట్లుంటుందని నా గురించి తెలిసినవారు చెబుతుంటారు. ఏమైతేనేమి, కొద్దిసేపటికి, కస్టమ్స్ సీనియర్ ఆఫీసరొకరు వచ్చి, జరిగిన దానికి క్షమాపణ చెప్పారు. తప్పు జరిగిపోయిందని ఒప్పుకున్నాడు. మీరు డ్యూటీ కట్టక్కర్లేదు. మీ కుర్చీని తీసుకెళ్ళండని చెబుతూ, అక్కడున్న సిబ్బందిని త్వరగా నా పని పూర్తిచేసి పంపమని హుకుం జారీచేశాడు. అలా బాబా కుర్చీని తీసుకుని గురుప్రసాద్, పూణే చేరుకున్నాం. తిరుగు ప్రయాణంలో మెహెర్‌జీతో మాట్లాడుతూ, చూశావా తమాషా!! “డ్యూటీ కట్టకుండా ఎలా తప్పించుకున్నామో! అనగానే ఆతను హతాశుడయ్యాడు. ఇదంతా ఓ నాటకీయమే!! రక్తికట్టింది. “కొండకు తాడుకట్టి లాగినట్లు, ఓ ప్రయత్నం చేశాను. విజయం వరించిందన్నాను, నవ్వుతూ చిలిపిగా. ఈ మాటలతో మెహెర్‌జీ అవాక్కయ్యాడు. ఆ పిదప, బాబా ఈ కుర్చీలో కూర్చుని చాలా సంతోషించారు. ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ డ్యూటీ చెల్లింపులపై జరిగిన ఉదంతమంతా ఉన్నదివున్నట్లు బాబాతో చెప్పాను. బాబా కూడా నవ్వుతూ ప్రేమగా నన్ను దగ్గరకు తీసుకున్నారు. నా నుదిటన చుంబించారు. నేడు ఈ కుర్చీ మెహెరాజాద్‌లో బాబావారి గదిలో వుంది. మీరు అనేకసార్లు ఈ కుర్చీని చూసుంటారు. ఐతే, కుర్చీ వెనుకున్న ఈ కహాని కొత్తదయివుండచ్చు. ఏ విషయం తెలియజేయగలరు!!

***

# కృష్ణా జిల్లాలో మెహెర్‌బాబా

కృష్ణా జిల్లాలోని ఉయ్యూరు, పామర్రు చుట్టుప్రక్కల గల గ్రామాలలోని 60 పాఠశాల గ్రంథాలయాలకు తమ బహుమతిగా మెహెర్‌బాబా మాస పత్రికకు వార్షికసభ్యత్వం (రూ.6000/–) శ్రీ శ్రీధర్, యస్ఆర్ నగర్ ఫోస్టాఫీసు, హైదరాబాద్ చెల్లించారు. స్థానిక బాబా ప్రేమికులు ఆయా పాఠశాలలకు మ్యాగజైన్ సకాలంలో అందుతున్న వైనాన్ని, మాసపత్రిక వినియోగాన్ని పరిశీలించవల్సిందిగా కోరుతున్నాము. మరిన్ని వివరాలకు 9959553218 సంప్రదించగలరు.

డాక్టర్ హారి కెన్‌మోర్‌కి బాబా ఇచ్చిన ఆఖరి ఆదేశం

# బాబావారి జుత్తు



బాబావారి జుత్తు మెత్తగా, గోధుమఛాయలో చాలా అందంగా వుండేది.
జుత్తు కొసలు బంగారు ఛాయలో మెరుస్తుండేవని మెహెరామాయి
తన జ్ఞాపకాలను పలు సందర్భాలలో తనను కలిసినవారితో గుర్తుచేసుకునేవారు.
బాబా ఆరుబయట ఎండలో నిలబడితే, సూర్యకాంతికి బాబా జుత్తు
ప్రకాశవంతంగా మెరుస్తుండేదని ఆమె చెప్పేది.
ప్రతిరోజూ బాబా తల దువ్వుతున్నప్పుడు రాలిన కేశాలన్నింటినీ
ఆమె భావితరాల కోసం బధ్రపరిచింది.
సుమారు 1920వ దశకం నుండి అలా సేకరించిన జుత్తుని
ఆమె ఒక డబ్బాలో దాచిపెట్టింది. నేడు మెహెరాజాద్‌లో బాబావారి గదిలో
ఒక అందమైన టేబుల్‌పై అవతారుని జుత్తుని చక్కగా అలంకరించారు.
1969 జూలై నుండి ఈ జుత్తులో బాబావారి ముఖం కలిపిస్తోంది.
ఈ జుత్తులో అవతారుడ్ని తొలిసారిగా దర్శించుకున్న మెహెరామాయి,
మెహెరాజాద్‌కి వెళ్ళినవారితో,

“బాబావారి జుత్తుకి ఎదురుగా నిల్చుని చూడండి.
అవతారుని దివ్య దర్శనమౌతుందని చెబుతుండేవారని”, ఆనాటి ప్రేమికులు చెప్తారు.
ఈ అందమైన అక్రిలిక్ అలంకరణ గురించి బాబా ప్రేమికుడు డాక్టర్ హారి కెన్‌మోర్, న్యూయార్క్ మరింత సమాచారం అందజేశారు.
అదేమిటో ఇకపై డాక్టర్ హారి మాటల్లోనే ఆలకిద్దాం.

**‘1968 నవంబరులో నేను మెహెరాబాద్‌కి వెళ్ళినప్పుడు జరిగిందీ సంఘటన.**
ఒక రోజున బాబా తన జుత్తు వున్న ఒక డబ్బా నా చేతికి ఇచ్చారు.
ఈ జుత్తు భావి తరాలవారి కోసం, సుమారు వెయ్యి సంవత్సరాలు వరకూ బద్రంగా వుండేలా జాగ్రత్త పరచమని నన్ను ఆదేశించారు.

**ఇది బాబా నాకు ఇచ్చిన ఆఖరి ఆదేశం.**
ఆ తర్వాత రెండు నెలలకే బాబా భౌతిక దేహం వదిలిపెట్టడంతో నేను షాక్ తిన్నాను. దాంతో బాబా నాకిచ్చిన డబ్బా గురించి పూర్తిగా మరచిపోయాను. ఆ తర్వాత సుమారు ఐదారు నెలలకు బాబావారి ఆదేశాలు గుర్తుకువచ్చాయి.
దాంతో, నా క్లినిక్‌లో సహాయకారిగా వున్న శ్రీమతి అనరూసా, ఆమె కుమారుడిని పిలిచి ఈ విషయంపై ప్రస్తావన చేశాను.
అనరూసా కుమారుడు లారీ కాగ్రక్ చక్కని సలహా ఇచ్చాడు.
ఆతను చికాగోలోని ఇలియనాయిస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శిల్పకళా శాస్త్రం చదువుతున్నాడు. లోహ శిల్పాల తయ్యారీకి ముందు ప్లాస్టిక్ పదార్థం లాంటి అక్రిలిక్‌తో మూసపోసి ఆ తర్వాత లోహంతో శిల్పాలను రూపొందిస్తారని చెప్పాడు.
ఆ మాదిరిగా, బాబావారి జుత్తును అక్రిలిక్‌తో భద్రపరచవచ్చని సలహా ఇచ్చాడు.
అది మాకు నచ్చింది. ఆ దరిమిలా, న్యూయార్క్‌లో అక్రిలిక్‌తో ట్రోఫీలు, అవార్డులు తయ్యారుచేసే వారిని కలిశాం. ఆ తర్వాత పదహారు అంగుళాల ఎత్తు, మూడు అంగుళాల వెడల్పుతో పారదర్శకంగా కనిపించేలా అవతారుని జుత్తు బద్రపరిచే కార్యక్రమం పూర్తయింది.

## మెహెరామాయి సంతోషించింది

మండలివారు, ముఖ్యంగా మెహెరామాయి బాబావారి జుత్తుని బద్రపరిచిన వైనాన్ని చూసి చాలా సంతోషించింది. బాబావారి జుత్తు రాబోయే వెయ్యి సంవత్సరాల వరకూ బద్రంగా వుంటుందని, డాక్టర్ హారి కెన్‌మోర్ బాబావారి ఆఖరి ఆదేశాన్ని చక్కగా అమలు చేశాడని నన్ను మనసారా అభినందించింది. ఈ దఫా మెహెరాబాద్ వెళ్ళినప్పుడు బాబావారి జుత్తున్న అలంకరణని మరింత నిశితంగా పరిశీలించగలరు.

***

# మా నాన్న శ్రీ యాగంటి గారి స్మృతిపథంలో

-శ్రీమతి కొత్త మెహెర్‌జ్యోతి, భువనేశ్వర్. (94902 56099)



మా నాన్నగారు శ్రీ యాగంటి సుబ్బయ్య గారు బాబాని 1962 నవంబరు 1 నుండి 4 వరకు పూణేలో జరిగిన ఈస్ట్ – వెస్ట్ గేథరింగ్‌లో మొదటిసారిగా దర్శించుకున్నారు.

ఆ కార్యక్రమానికి ఆయన పూణే వెళ్ళడం కూడా అనుకోకుండా జరిగింది. నరసరావుపేటలో వుంటున్న ప్రముఖ అడ్వకేట్ శ్రీ ముత్తనపల్లి వేంకటేశ్వరరావు గారి దగ్గరకి మాతాత మా నాన్నని ఏదో పని మీద పంపారు.

ఆ లాయరుగారు మేమందరం మెహెర్‌బాబా దగ్గరకి వెడుతున్నాం. ప్రత్యేక రైలులో విజయవాడ నుండి వెడుతున్నాం. రెండు టికెట్లు ఖాళీగా వున్నాయి. నీవు వస్తానంటే ఒక టిక్కెట్టు రిజర్వు చేస్తామని చెప్పారు. అప్పటికి మా నాన్నగారికి బాబా గురించి పెద్దగా ఏమీ తెలియదు. ఐనప్పటికీ సరదాగా పూణే వెళ్ళొచ్చని ముత్తనపల్లి గారితో సరేనని చెప్పానని మా నాన్న తరచు చెప్పేవారు. ఆ తర్వాత ఒక రోజున బాబా కలలో కనిపించి, తనవైపు కొంచెం కోపంగా చూశారట. ఈస్ట్– వెస్ట్ సమావేశాలలో బాబా ఆయనికి ఆలింగనమిచ్చి, ఆయన చెంపల్ని ప్రేమగా నిమిరారట. అవతారుని స్పర్శ తనకు ఎలక్ట్రిక్ షాక్‌లాగా వుండిందని, మా నాయన చెప్పేవారు. ఆ పిదప 1965లో తిరిగి మరోమారు బాబాని పూణేలో దర్శించుకున్నారు. ఆ దర్శనానికి కొన్నిరోజుల ముందు, తీవ్ర జ్వరంతో తాను బాధపడ్డానని, 18 రోజులు లంఖనం వున్నానని,19వ రోజున బాబా కలలో కనిపించి,ఒక మందు బిళ్ళ ఇచ్చారన్నారు. ఆ మందు మ్రింగుతుంటే గొంతులో ఇబ్బందివస్తే, బాబా తన వీపుపై మూడుసార్లు ప్రేమగా నిమిరారట. ఆ తర్వాత తనకెన్నడూ జ్వరమన్నది రాలేదని గర్వంగా చెప్పేవారు. మెహెర్‌బాబాను దర్శించుకున్నాక ఆయన జీవిత విధానమే మారిపోయింది.ఏది జరిగినా బాబా దయవల్లనే అనుకోవడం, బాబాతప్ప మరొకటి లేదని, ఆయనే మనకు సర్వస్వం అని చెప్పేవారు. ఆయన స్కూలు టీచరు కదా, సమయం చిక్కితే తన దగ్గర చదువుకునే విద్యార్థులకి బాబా గురించి చెబుతుండేవారు. అలాగే పిల్లల పలకలపై జైబాబా అని పలకపై రాయించి జైబాబా అని వారిచేత అనిపిస్తూ దిద్దించేవారు. పసిపిల్లలను ముద్దాడేటప్పుడు కూడా జైబాబా అంటూ ప్రేమగా దగ్గరకి తీసుకునేవారు.

జైబాబా అంటూ వారికి మాటలు నేర్పేవారు. ఆయన తెల్లవారుఝూమున 3 గంటలకే లేచి, చన్నీటితో “బాబా బాబా” అంటూ తలస్నానం చేసేవారు. అనంతరం బాబా ఫోటో ముందు నిలబడి బిగ్గరగా బాబా నామస్మరణ చేశేవారు. సరిగ్గా ఉ. 5 గంటలకు ప్రార్థనలు చేశేవారు. ఆ మాదిరిగా, ఉదయం 7 గంటలకు, మ. 12, సా. 5, రాత్రి 7, చివరిగా రాత్రి 9 గంటలకి బాబా ప్రార్థనలు తెలుగు, ఇంగ్లీషుల్లో చేశేవారు. ప్రార్థన చేసేందుకు ముందుగా కాళ్ళు, చేతులు కడుక్కునేవారు. ఈ మాదిరిగా ఆయన శరీరం వదిలిపెట్టేవరకూ చేశారు. ప్రతినెలా పౌర్ణమి రోజున అవతారుడి చిత్రాన్ని ముద్దాడి, పూర్ణచంద్రుడ్ని చూశేవారు. అమరతిథికి వెళ్ళి తిరిగి వచ్చాక, బాబా ప్రసాదాన్ని పొట్లాలుకట్టి బాబా ప్రసాదంగా మా వూర్లో అందరికీ ఇచ్చేవారు. అమరతిథి విశేషాలు ఎన్నోరోజులు చెబుతుండేవారు. బాబా సెంటర్ల వార్షికోత్సవాలు ఎక్కడ జరుగుతున్నా తప్పక వెళ్ళేందుకు ప్రయత్నించేవారు. ఆయన బహు నిరాడంబరుడు. ధవళ వస్త్రాలతో, పంచ కట్టుతో కల్లాకపటంలేని అచ్చతెలుగు తెలుగు పండితుడిగా అగుపించేవారు. ప్రతినిత్యం ఆయన మాటలు, చేతలు అన్నీ బాబా ధ్యాసలోనే వుండేది. ఆయన తెల్లని పొడవాటి చొక్కాపై బాబా బ్యాడ్జి, చేతిలో బాబా ఫోటోవున్న పుస్తకం తప్పక ఉండేవి. ఇవి లేకుండా ఆయన్ని నేన్నడూ చూడలేదు. ఆయనికి ఫోటో తీయాలంటే కూడా, ఒడిలో బాబా ఫోటోవున్న పుస్తకం తప్పక ఉండితీరాలి. నా చిన్నతనం నుండి యిప్పటి వరకూ ఆయన కొన్ని వందలసార్లు బాబా సాహిత్యాన్ని చదివారనిపిస్తుంది. అలా ఆయన చదువుతూంటే ఆయన కళ్ళు ఆనందంతో చెమర్చేవి. తలగడక్రింద గాడ్ స్పీక్స్ గ్రంధాన్ని ఉంచుకునేవారు. బాబా సందేశాలను డైరీలలో వ్రాసుకునేవారు. ఆయన ఎక్కడికైనా ప్రయాణం చేసేటప్పుడు కూడా ఒంటరిగా వుంటే, కళ్ళుమూసుకుని బాబానామం స్మరించేవాడు. **“నా ప్రేమికులు హృదయపూర్వకంగా ఏదైనా అడిగితే వారి కోరికను తప్పక నెరవేరుస్తానన్నబాబావారి సందేశం ప్రకారం,** ముటుకూరు గ్రామంలో బాబావారి గుడి నిర్మించుకోవాలన్న మా అమ్మనాన్నల కోరిక బాబా తీర్చారు. ఆ తర్వాత మా అమ్మా నాన్నలకి బాబా సెంటరే తమ జీవితమయ్యింది. ఆయన చివరి రెండు రోజులు నీరసంగా వున్నారు. జూన్ 3న సాయంకాలం అందరితో మాట్లాడారు. తేలికపాటి జావ తీసుకుని పడుకున్నారు. రాత్రి ఒంటి గంట, రెండున్నరప్పుడు రెండుసార్లు బాత్రూం కోసం లేచారు. నీరసంగా వున్నా బాబా నామస్మరణతోనే పడుకున్నారు. ఆ రాత్రిపూట ఆయనకి ఆయాసంలా వుంటే, మా అమ్మ ఆయన ఛాతీపై రుద్దుతూ “జైబాబా” అంటూ బాబా ఫోటోను దగ్గరగా చూపించగా, నాన్న కూడా పదేపదే జైబాబా చెబుతూ సునాయాసంగా బాబాలో ఐక్యం అయ్యారు. అంతా ఐదు నిమిషాల్లో జరిగిపోయింది. శరీరం వదలిపెట్టేటపుడు ఎవరైతే బాబానామం తలచుకుంటారో వారు తన దగ్గరికే వస్తారని బాబావారిచ్చిన సందేశాన్ని మా నాన్న పూర్తిగా నిజం చేశారు. ఆయన ధన్యుడు. ::::::



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925 నుండి...) - తెలుగుసేత:
శ్రీ మల్లాది రామారావ్, మెహెరాబాద్

(గత సంచిక తరువాయి)

ఆ వేళ శుక్రవారం. అక్టోబరు రెండవ తేది. సంవత్సరం 1931.
బాబావారు, గాంధీ మహాత్ముడు రెండవసారి కలిసిన రోజు.
వీరిద్దరి తొలిపరిచయం రాజపుతానా నౌకపైన, లండన్ వస్తుంటే.
మహాత్ముడు చెప్పాడు మెహెరీశునితో, లండన్‌లో మిమ్మల్ని మళ్ళీ కలుస్తానని.
కానీ వీలుకాలేదు. ఎందుకంటే, గాంధీ బ్రిటీషు రాజధానికి వచ్చింది
బ్రిటీషు ప్రభుత్వంతో చర్చలకి. మాకు స్వాతంత్ర్యం కావాలని కాంగ్రెస్ పార్టీ
చేస్తున్న ఉద్యమ నాయకుడిగా మహాత్ముడు వచ్చాడు. ఇంకా ఎందరో నాయకులని
కూడా చర్చలకి ఆహ్వానించింది బ్రిటీషు ప్రభుత్వం.
ఈ చర్చలకే గుండ్ర బల్ల సమావేశాలని పేరు.
హిందువులకీ, ముస్లిమ్‌లకీ వేర్వేరు నియోజక వర్గాలు
ఏర్పాటు చేయాలా అన్నది వో చర్చనీయాంశం.
భారతీయ నాయకుల్లో ఏకాభిప్రాయం లేదు ఈ అంశంపై.
కొందరు మాకు, అంటే ముస్లిమ్‌లకి ప్రత్యేకంగా నియోజకవర్గాలు వుండాలని
పట్టుపడితే, ఇంకొందరు ఉమ్మడి నియోజక వర్గాలు
"హిందూ - ముస్లిమ్‌ల" ఐక్యతకి అవసరమని డిమాండ్ చేస్తున్నారు.
ఈ నేపథ్యంలోనే మెహెరీశుడు మహాత్ముడి రెండవ సమావేశం జరిగింది.
బాబావారిని కలవాలని వుంది కానీ ప్రభువు సమక్షానికి రాలేకపోతున్నాను.
బాబావారిని నా బసకి తీసుకురాగలుగుతారా అని గాంధీ గారు వుత్తరం వ్రాయడం,
బాబావారు కదిలి రావటం పాఠకులకి తెలుసు.
ఒక్క ఐదు నిమషాలు వచ్చినా సంతోషిస్తానని గాంధీ గారు వ్రాశారుట
ఆ ఉత్తరంలో. ఇంతకీ ఈ ఉభయులూ ఏ విషయాలు మాట్లాడుకొన్నారు?
ఆధ్యాత్మిక సంగతులు, కొన్ని రాజకీయ విషయాలు ప్రస్తావనకి వచ్చాయి.
ఉమ్మడి నియోజకవర్గాల విషయంలో తమ ప్రయత్నాలని గాంధీ గారు వివరించారు.
ఈ వైనాన్ని గత సంచికలో తెలుసుకొన్నాము.

బాబా గాంధీల గోష్ఠి వివరాలు మరికొన్ని ఇప్పుడు.
బ్రిటీషు ప్రజల నాడి తెలుసుకొన్నారా మీరు? అని అడిగారు బాబావారు.
చర్చలు ప్రభుత్వంలో జరుపుతున్నారు. భేష్.
సామాన్య ప్రజలు చాలామందిని కలిసే వుంటారు కదా.
వాళ్ళ స్పందన ఎలా వుంది, మీ డిమాండ్‌లకి, అని అడిగారు.
**గాంధీ:** అధికార యంత్రాంగం బందిపోటు దొంగల్లా కనిపిస్తున్నారు.
వాళ్ళ తెలివితేటలు అమోఘం. దోపిడి వాళ్ళ లక్ష్యం.
కానీ, సామాన్య తెల్లవారు అంటారా. చాలా మంచి వాళ్ళనిపిస్తోంది.
మాటామంతీ బాగున్నాయి. ఇదొక శుభసంకేతం. కాస్తంత వూరటనిస్తోంది.
భారత స్థితిగతుల గురించిన అవగాహన కల్గించాము వాళ్ళలో.
విత్తనం వేశాము. ఫలసాయం రావటానికి టైమ్ పడుతుంది.
అప్పటిదాకా వోపికగా ఎదురు చూడాలి. ఇంకో గత్యంతరం ఏముంది.
ప్రజాభిప్రాయం మారితే, ప్రభుత్వం కదిలి వస్తుంది కానీ బాబా,
ఇప్పుడూ ఈ గుండ్రబల్ల సమావేశాలకి వచ్చిన మేము,
చేతులూపుకొంటూ వెనక్కి వెళ్ళామనుకోండి
బ్రిటీషు పెద్దలు మమ్మల్ని ఆటపట్టిస్తారు.
ఈ మహానగరం అడివిలో తిరగడానికి వచ్చామని ఎద్దేవా చేస్తారు.
ఇక్కడ, ప్రభుత్వంలో వున్న వాళ్ళకి ఉచ్చనీచాలు లేవు.
అయినా బాబా, వాళ్ళు దిగిరాక తప్పదు.
మనకు, భారతీయులకి ఎక్కువ అధికారం అప్పగించక తప్పదు.
అప్పటిదాకా కొంచెం వోపిక వహిస్తాము.
అలా అని బాబా, వూరికే కూర్చొంటామని కాదు.
ఇండియాకి వాపసు వెళ్ళాక చేతులు ముడుచుకొని
స్తబ్దుగా వుంటామని అనటం లేదు. కొత్త కార్యక్రమాలు చేపడ్తాము.
కొత్త ఉద్యమాలకి నాందీ పలుకుతాము.
ఈ ఉద్యమాలవల్ల ఎన్నో కష్టనష్టాలు వస్తాయి బాబా.
కాదనను. కానీ మా సహనాన్ని కోల్పోము.
చాలా వోపికగానే వుంటాము బాబా అన్నారు.
బాబా వారు గాంధీ గారి మాటల్ని సావధానంగా విన్నారు.
భుజం తట్టారు. ధైర్యంగా ముందుకు వెళ్ళమన్నారు. వో హితవాక్యం చెప్తూ,
వో చిన్న హెచ్చరిక కూడా చేశారు. అక్షరఫలకంపై బాబావారి వ్రేళ్ళు కదులుతుంటే,

గాంధీ గారు శ్రద్ధగా కూడబలుక్కొని చదివారు.
ఇంతకీ బాబా వారేమన్నారు.
నువ్వు వో విషయం తెలుసుకోవాలి గాంధీ అన్నారు.
ఆ విషయమేమిటో సూటిగా చెప్పారు. మున్ముందు గడ్డు కాలం వస్తుంది.
భారతదేశంలో బ్రతుకు నరకప్రాయం అవుతుంది.
ప్రజలు నానా అవస్తలు పడతారు. కంగారుపడకు.
ఆధ్యాత్మిక దృక్పథంతో చూస్తే, ఈ కష్టాలు, ఈ బాధలు మేలు చేస్తాయి. భయపడక్కర్లేదు.
ఎంత ఎక్కువగా బాధలు భరిస్తే, అంతే స్థాయిలో మేలు కలుగుతుంది,
అని వివరించారు. బాబా వారి రహస్య గ్రంధాన్ని చదివిన మహాత్ముడికి
ప్రభువు ఆంతర్యం అవగతమైంది. ప్రభువు మాట నచ్చింది. ఆ మాటే చెప్పాడు.
నాకూ అలానే అనిపిస్తోందన్నాడు. కష్టాల కడలి మేలు చేస్తుంది బాబా ప్రజానీకానికి
అన్నాడు. నిజం తెలిసి వస్తుంది భారతీయులకి అన్నాడు. కళ్ళు తెరుస్తారు.
తమ అంతర్గత కలహాలకి తామే కారణమని గ్రహిస్తారు.
అంతే కొట్లాటలపై తెరపడుతుంది, అవునా బాబా, అన్నాడు మహాత్ముడు.
నిస్సందేహంగా అన్నారు బాబా. ఎప్పుడైతే నిజం తెలిసి వస్తుందో,
కలహాలు, కలతలు దూరమవుతాయి. సఖ్యత ఏర్పడుతుంది.
ఇదే జరిగితే గాంధీ గారు కోరుకొంటున్న హిందూ–ముస్లిమ్‌ల సమైక్యత
సాధ్యమవుతుంది. బాబావారు ఈ మాటే శెలవిచ్చారు.
తాము చెప్పిన కష్టాలు, బాధలు పర్వం దాటితే, ప్రజల్లో సామరస్యం వస్తుంది.
ఈ ఐక్యత చిరకాలం వుంటుంది అని అంటూ బాబావారు గాంధీ గారికి
వో హితవాక్యం చెప్పారు. ఐక్యం వస్తుందని చెప్పానని, మీ కృషి మానకండి అన్నారు.
హిందువుల్నీ, ముస్లిమ్‌లనీ దగ్గరకి చేసే ప్రయత్నాలు మీ వంతు మీరు చేయండి.
హిందువులు – ముస్లిమ్‌లు ఒకటయ్యారా – మంచిదే!
మీ ప్రయత్నం ఫలించినట్లే నన్నారు.
మీరు కనుక మీ వంతు కృషి చేయకపోతే,
రేప్రొద్దున ఏం జరిగినా మిమల్నే తప్పు పడతారందరూ అని హెచ్చరించారు.
**గాంధీ:** నా వంతు ప్రయత్నం చేస్తున్నాను.
మున్ముందు కూడా చేస్తాను బాబా నా శాయశక్తులా.
కానీ బాబా, భారతదేశంలో అధికారం మన చేతుల్లో లేదు.
నామమాత్రంగా కూడా లేదు అధికారం మనకి.
అందుకనే హిందూ ముస్లిమ్ సమైక్యతకి గట్టి కృషి తప్పదు.

అంతా భగవదేచ్ఛ. బాబావారు తలపంకించారు.
లెస్స పలికితివి అని చెప్పకనే చెప్పారు.
తమకి గాంధీ గారి రాజకీయాలలో సంబంధం లేదన్న సంకేతం మరోసారి యిచ్చారు.
తమ దృష్టి ఆధ్యాత్మికతపైనే అని స్పష్టం చేశారు.
మీ అందరి దృష్టిలో అంటే, స్వాతంత్ర్య సమరయోధులకి స్వపరిపాలన
చాలా ముఖ్యం. మీలాగే ప్రపంచవ్యాప్తంగా ఏదో ఒక డిమాండ్‌తో రోడ్డున పడతారు.
పిచ్చి ఉద్రేకంతో వూగిపోతారు మనుష్యులు.
కానీ నా దృష్టిలో యిదంతా వో తమాషా. వీధి నాటకం.
యింకా చెప్పాలంటే వో ఆట నా దృష్టిలో.
ఇవి నన్ను గాభరా పెట్టవు సరికదా నవ్వు తెప్పిస్తాయి.
బాబా, మా కష్టాలు, ఉద్యమాలు మీకు సరాదాగా కనిపిస్తున్నాయా అని
మీరు అడగవచ్చు. నేనా ఏ చింతలు లేనివాడిని. మృత్యువును అనుభవించినవాడిని.
ఎంత పెద్ద సమస్య అయినా నాకు పట్టదు.
ఒక దేశపు వునికికి ప్రమాదం తెచ్చే విషయమయినా,
ఒక సమాజం మనుగడకి ముప్పు తెచ్చే సంగతయినా
నా దృష్టిలో అప్రధానమైనవే.
ఆధ్యాత్మిక పురోగతిపై ప్రభావం చేసే వాటినే పట్టించుకొంటాను.
ఎందుకు అంటావా, ఎందుకు అంటే, ఆధ్యాత్మిక జీవనమే నిజమైన జీవనం.
ఆధ్యాత్మిక జీవన మార్గంలో అడుగడుగునా దివ్యానందమే.
అక్కడ దివ్యానందం తప్ప మరింకేమీ లేదు.
నాకా దివ్యానందం కరతలామలకం.
ప్రతిరోజు, ప్రతిగంట, ఇంకా చెప్పాలంటే ప్రతిక్షణం దివ్యానంద స్థితి
ఏ వొక్కరిదో కాదు. అందరిదీ అందరిలోనూ వుంది.
అందరిలో వుంటే సరిపోదు కదా
తమలోనే ఆ దివ్య శక్తి దాగి వుందని అందరూ తెలుసుకోవాలి.
అందులో తాదాత్మ్యం చెందాలి అన్నారు.
ఈ దివ్యానందం కోసం మానవాళి అర్రులు చాస్తారా అన్న
దీర్ఘాలోచనలో పడ్డానన్నారు. ఆ మధురిమ రుచి చూడాలి ప్రపంచ ప్రజానీకం.
ఈ గమ్యం చేర్చేది ఏలాగు అన్న తాపత్రయం తమది అన్నారు.
ఇంకో మాట శెలవిచ్చారు.
నేనింతగా చెప్తున్న దివ్యానందానికి తాళం వేసి వుంది ఇప్పుడు.
ఆ తాళం తీయాలంటే తాళం చెవి కావాలి.

మరి ఆ చెవి వున్నది నా దగ్గర మాత్రమే.
ఆ సంగతికేమి కానీ ఇందాక చెప్పానే మీ ఉద్యమాలు చూస్తే నవ్వు వస్తుంది నాకని.
ఆ మాట ఎందుకన్నానో మీ కర్థమయింది కదా, అన్నారు.
గాంధీ గారు తలాండించారు.
మెహెరీశుడు ప్రస్తావించిన తాళం చెవిపై ఆయన దృష్టి పడింది.
ఆ చెవి తమకి దొరికితే ఎంత బాగుండననిపించింది.
మెహెరుడు ప్రస్తావిస్తాడా? అడిగితే పోలే అనుకొన్నట్లుంది,
మనసులో మాట బయటపెట్టారు కొంచెం తటపటాయిస్తూనే.

**గాంధీ :** ప్రభూ! నన్ను అనుగ్రహించండి. ఆ తాళం చెవిని నాకు ప్రసాదించండి.

**బాబా :** తప్పకుండా

**గాంధీ :** మాట యిస్తున్నారుగా! మాట తప్పరుగా!

**బాబా :** ఆహా! వో మాట చెప్పనా! ఆ తాళం చెవి నీ సొంతం.
నీకే తెలిసి వస్తుందీ సంగతి వో రోజుకి. నీకెంత త్వరగా దొరుకుతుంది అంటావా! అది నీపై ఆధారపడుతుంది. అన్నీ వదిలి పెట్టి దివ్యానుభూతి కోసం తపించు. ఇది ఎంత త్వరగా చేస్తే, అంత త్వరగా నీ పరమవుతుంది తాళం చెవి. నీ ప్రయత్నాలకి వూతం యిస్తాను. దిగులు పడకు ఏమాత్రం.
గతంలో చెప్పానోసారి నీకు. రాజకీయాలకి స్వస్తి చెప్పమన్నాను.
నా ఆశ్రమంలో చేరమన్నాను.
మరి నువ్వు నాతో వుండడానికి రాగానే, తాళం చెవి యిస్తాను సరేనా!

**గాంధీ :** నాకూ మీ ఆశ్రమానికి రావాలనే వుంది బాబా!

**బాబా :** మీకో తమాషా తెలుసా! దివ్యానందం ఎక్కడో బయట లేదు.
అందరిలోనూ దాగి వుంది. కానీ అందరూ ఏం చేస్తున్నారు, బయట వెతుకుతున్నారు. ప్రజల దృష్టిని అంతర్ముఖం చేస్తే వాళ్ళకి దివ్యానందంలో మునిగి తేలుతారు కదా. ఇందుకు ఏం చేయాలి? దీనిపై దృష్టిపెట్టాను.
మౌన వివరణ చేస్తాగా,
అప్పుడు కొత్త దిశానిర్దేశం చేస్తాను.

**గాంధీ :** నాకు అర్థమవుతుందా ఆ మాట

**బాబా :** నీకే కాదు. అందరికీ అర్థమవుతుంది అందరూ నమ్మదగినది నా ఉవాచ

**గాంధీ :** ఎప్పుడు మౌన విరమణ చేస్తారు బాబా!
ఆరేళ్ళుగా ఎదురుచూస్తున్నా ఆ శుభ ఘడియ కోసం.
ఆరేళ్లు అయింది మౌన విరమణ చేస్తున్నానని మీరు చెప్పి.

**బాబా :** ఈ ఏడాది మౌన విరమణ చేస్తా, వచ్చే ఆర్నెల్లలో.

**గాంధీ** : ఇంకా ఆర్నెల్లా! అంతదూరం దేనికి?

**బాబా** : ఆర్నెల్లు ఆగాల్సిందే. ముందస్తు కాదు.
రెండు నుంచి, ఆర్నెల్ల లోపల మౌన విరమణ చేస్తాను.

**గాంధీ** : ఓకే బాబా! మీరు రెండు నెలల్లో మౌన విరమణ చేయగలిగితే
నాకు యింకేమి కావాలి. అంతకంటే ఆ మహదానందం యింకేముంటుంది
బాబా. మీమాట వినాలని తహతహలాడుతున్నాను. బాబావారు చిరునవ్వు
నవ్వారు. బాబాజాన్ ఎప్పుడో చెప్పింది భవిష్యవాణి అన్నారు.
పదకొండు ఏళ్ళ క్రిందట, 1920లో కలిశాను ఆ మహాతల్లిని.
అక్కడున్న వారికి నన్ను చూపించింది.
'ఈ నా బిడ్డడు యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తాడు భవిష్యత్‌లో, అన్నది.
బాబాజాన్ ఎప్పుడూ స్పష్టంగా చెప్పదు ఏ సంగతి.
అస్పష్టంగా మాట్లాడేది. కానీ ఆవాళ్టి భవిష్యవాణి చాలా స్పష్టంగా
వినిపించింది. ఆ మహతల్లి 120 ఏళ్ళు పైబడిన ముదుసలి.
ఈ మధ్యనే తనువు చాలించింది.

**గాంధీ** : రేపు టర్కీ వెడుతున్నారు కదా బాబా!
తిరిగి లండన్‌కి వస్తారా తప్పకుండా!

**బాబా** : ఆహా!

**గాంధీ** : అయితే మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను అప్పుడు.

**బాబా** : ఈలోగా నేను తిరిగి వచ్చేలోగా మీరు వో పని చేయండి.
నియోజకవర్గాల విషయంలో ఏకాభిప్రాయం సాధించండి.
ఖచ్చితమైన నిర్ణయానికి శతాధా ప్రయత్నించండి.
టర్కీ నుంచి తిరిగి వచ్చాక మిమ్మల్ని కలుస్తాను.
కొన్ని నిర్దిష్టమైన విషయాలని చర్చిస్తానప్పుడు.

**గాంధీ** : ధన్యోస్మి! బాబా!
ఆ సుమధుర ఘడియ కోసం ఆత్రంగా ఎదురుచూస్తుంటాను.
మీకు తెలుసుగా బాబా ఈ నియోజక వర్గాల సమస్యని అందరికీ
ఆమోదయోగ్యమయ్యేలా పరిష్కరించాలి.
దేశం కోసం ఈ బాధ్యతని నా భుజాలపై వేసుకొన్నాను.
ఈ బరువు నుంచి విముక్తి మీరే కల్గించాలి.
ఏంచేస్తారో మీ యిష్టం!
అలా చేస్తేనే మీ దగ్గరకి రాగలుగుతాను.

మీ ఆశ్రమంలో వుండగలుగుతాను.
ఏకాంతవాసం చేయగలుగుతాను.
శేష జీవితాన్ని భగవత్ ధ్యానంతో గడుపుతాను కానీ బాబా,
ప్రస్తుత అయోమయ పరిస్థితుల్లో నా దారి నేను చూసుకోలేను.
ప్రజలని వదలి మీ దగ్గరకు రాలేను.
అందుకే బాబా నా విజ్ఞప్తి!
నా బరువు తొలిగిస్తే మీ దగ్గరకి వచ్చేస్తాను సంతోషంగా.

**బాబా :** సరే! నీ శక్తి మేరకి ప్రయత్నించు.
ఫలితం ఎలా వుంటుందని బెంగ పెట్టుకోకు.
బుర్ర పాడుచేసుకోకు. ఎలా జరుగవలసినది అలా జరుగుతుంది అని
భగవదేచ్ఛకి వదిలేయి ఫలితాలని. వో విషయం గుర్తుంచుకో గాంధీ.
నువ్వు చిత్తశుద్ధితో చేయగలిగినంత చేస్తే చాలు.
శక్తిని మించి చేయలేవు కదా!
ఫలితం దైవాధీనమే ఎప్పుడూ! అవునా!
అందుకనే చింతించకని చెప్తున్నాను.
నాకిచ్చిన మాట గుర్తుంచుకో.
మిగతా విషయాలని నాకు వదిలేయి. నేను చూసుకొంటాను.

**గాంధీ :** నా పరిస్థితులు మీకు తెలుసుగా బాబా!
నాపై వున్న వొత్తిడి కూడా మీకు తెలియనిది కాదు.
ఈ ఒత్తిడి రోజురోజుకీ పెరుగుతోంది.
నిన్నకూడా అర్ధరాత్రి దాటే వరకూ పనిచేస్తున్నా. రెండు కొట్టింది గడియారం.
కానీ మా చర్చలు పూర్తి కాలేదు. ఇంకో విషయంపై తర్జన భర్జన చేయాలి.
మీరు వస్తున్నారు కదా! ఇంక పడుకోబోతే,మెళుకువ రాదు.
అందుకనే గోష్ఠి ముగించి, నిద్రలోకి జారుకొన్నాము.

**బాబా :** ఓహో! అలాగా! నా సంగతి తెలుసా!
రోజూ నేను వొంటి గంటకో రెండుకొట్టాకో నిద్రపోతాను.

**గాంధీ :** బాబా, మీరెక్కడ మేమెక్కడ. మీరు దేవుడు
మేము మామూలు మనుష్యులం. మీరయితే కునుకే తీయనక్కర్లేదు.
మాకు అలా కాదుగా, నిద్ర లేకపోతే తట్టుకోలేము.
పగలంతా కునికిపాట్లు పడతాము.

**బాబా :** సరే! ఈవాళ్టికి శెలవ్. టర్కీ నుంచి వచ్చాక కబురు పంపుతాను.

**గాంధీ :** తప్పకుండా బాబా, మీ కబురు కోసం ఎదురు చూస్తుంటాను.

ఈవాళ మా బసకి వచ్చారు. మా కెంతో ధైర్యం చెప్పారు. మీకు సదా ఋణపడి వుంటాము. వీలయితే మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను బాబా.

**బాబా :** వీలయితే కలువు. సంతోషిస్తాను. ఇక్కడ లండన్‌లో యింకా ఎన్ని రోజులు వుంటారు. ఎక్కడికి వెడతారు యిక్కడ నుంచి.

**గాంధీ :** అక్టోబరు నెలాఖరు వరకు ఇక్కడే వుంటాను బాబా. రోమేన్ రోలాండ్‌ని కలవాలి. ఆయన స్విట్జర్లాండ్‌లో వుంటాడు. అందుకని ఆ దేశం వెడతాను. అక్కడి నుంచి బెర్లిన్ రమ్మని కూడా ఆహ్వానం వచ్చింది. వీలయితే టర్కీ కూడా వెడతాను. కానీ అక్కడి నుంచి ఆహ్వానం లేదు. ఎవరూ పిలవలేదు. ఈజిప్ట్, పాలస్తీనా వెళ్ళాలని వుంది. రెండూ దారిలోనే వస్తాయిగా అందుకని.

**బాబా :** పాలస్తీనా కూడా వెళ్ళాలని వుందా! భేష్ తప్పకుండా వెళ్ళక్కడికి.

**గాంధీ :** పాలస్తీనా వెళ్ళాలనే నా సంకల్పం బాబా! మా ఓడ ఆ దారినే పోతుంది. సయీద్ రేవు పట్టణంలో దిగి అటుగా వెళ్ళవచ్చు. సమయమనుకూలిస్తే వెడతాను పాలస్తీనాకు. సరే కానీ బాబా, మీరు టర్కీ నుంచి తిరిగి వచ్చేసరికి నేను తిరుగు ప్రయాణం హడావుడిలో వుంటాను. బహుశా వో పది పన్నెండు రోజుల్లో బయలుదేరతాను. మరి అంతతక్కువ వ్యవధిలో మీ దర్శనం దొరుకుతుందా నాకు.

**బాబా :** వో పని చేస్తా! టర్కీ నుంచి రాగానే, వస్తాను నేనే. ఎప్పుడు కలిసేదీ కబురు పెడ్తాను సరేనా! మరి శెలవు తీసుకోనా గాంధీ. మీ సంగతి ఏమిటి! ఇప్పుడు ఎక్కడికైనా వెళ్ళాలా మీరు.

**గాంధీ :** అవును బాబా! కొంచెం బయటకి వెళ్ళాలి. మీరు వస్తున్నారని కొన్ని పనులు ప్రక్కకు పెట్టా. ఇదిగో మీతో శలవ్ తీసుకొన్నాక వెడతాను. బాబావారు లేచి నిలబడ్డారు. గాంధీగారు కూడా కుర్చీలో నుంచి లేచారు. భక్తి ప్రపత్తులతో ప్రభువుకి నమస్కారాంజలి ఘటించారు. ఛాన్జీతో, రుస్తుంతో కరచాలనం చేశారు. ఆ రోజు ఆయన 62వ జన్మదినం. తమ జన్మదినం రోజునే మెహెరీశుని దర్శించడం తమ అదృష్టమనుకొన్నారు. అక్కడ నుంచి బాబావారు తమ బసకి తిరిగివచ్చారు. కిట్టీ దేవి యింట కదా బాబా వారి బస. బాగా ప్రొద్దు పోయింది. స్థానిక ఇంగ్లీషు ప్రేమికులతో గోష్ఠికి యిదే ఆఖరు రాత్రి. ఎందుకంటే, ఉదయానే టర్కీకి బయలుదేరతారు కదా!

**-సశేషం**

# కొత్త పుస్తకం




## సద్యః ఫలితం

మెహెర్‌బాబా పత్రిక ప్రారంభించి రెండు దశాబ్దాలు నిండిన శుభ తరుణంలో **"సద్యః ఫలితం"** మకుటంతో రమారమిన 40 కథాంశాలతో ఓ చక్కని పుస్తకాన్ని పాఠకులకు ఓ చిరుకానుకగా అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. డాక్టర్ మల్లాది శారద అడపాదడపా మెహెర్‌బాబా పత్రికలో గత కొన్నేళ్ళుగా రాసిన అవతారుని సందేశాలతో కూడిన కథాంశాలలో కొన్నింటిని గ్రంథస్తం చేయడమైంది. ఈ పుస్తకాన్ని త్వరలో ప్రచురించి పాఠకులకు అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. పరిశీలించగలరు.



## శ్రీ అంధవరపు బాబాలో ఐక్యం

చీపురుపల్లి కేంద్ర వ్యవస్థాపక సభ్యులు శ్రీ అంధవరపు మోహనరావు (77) 2021 జూలై 13న తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస వదిలారని శ్రీ కొల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం బాబా నామ స్మరణలో గడిపే శ్రీ మోహన రావు స్థానిక బాబా కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొనేవారని, కేంద్ర కార్యదర్శి శ్రీ మహేష్ తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని బాబా ప్రేమికులందరూ అవతారుని నామస్మరణతో మౌనం చేశామని అన్నారు.

## పుస్తక సమీక్ష

**కొత్తగా ప్రచురించిన బాబా సాహిత్య గ్రంథాలను, పుస్తక సమీక్ష కోరువారు ఆ పుస్తక రెండు ప్రతులను మెహెర్‌బాబా పత్రిక చిరునామాకు పంపగలరు.**

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

**1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ**

**(గత సంచిక తరువాయి)**

1958 ఫిబ్రవరి 25. బాబా సహవాస్ కోసం వచ్చిన స్త్రీ, పురుష ప్రేమికులతో నిండి వుంది. భజనలు, ఆరతి పాటల ఆలాపనతో మెహెరాబాద్ ఓ పండుగ వాతావరణంలో వుంది. బాబాను సహవాస్ వేదిక వరకూ తీసుకువచ్చేందుకు పడవ ఆకృతిలో అలంకరించిన ఓపెన్ టాప్ కారుని ఏర్పాటు చేశారు. ఆరంగావ్‌కు చెందిన బాబా ప్రేమికుడైన మాల్‌వాడే ఆ కారుని నడిపేందుకు సిద్ధంగా వున్నాడు. సహవాసీలందరూ బాబావారి రాక కోసం ఎదురుచూస్తూ అహ్మద్‌నగర్ ప్రధాన రహదారికి సుమారు అర మైలు పొడవున బారులుతీరి నిల్చున్నారు. ఆరంగావ్ ప్రజలు పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ పెద్ద క్యూగా నిల్చున్నారు. అలాగే స్థానిక ఆరంగావ్ ప్రజలు కొందరు ఎవరైతే అక్కడ పవిత్ర నదీజలాలు తీసుకురావాలని వెళ్ళారో వాళ్ళు నీళ్ళతో తిరిగి వచ్చారు. అవతార్ మెహెర్‌బాబా కి జై అని నినాదాలతో ఆ ప్రాంగణమంతా మారుమ్రోగుతోంది. ఇదే సమయంలో బాబా మెహెరాజాద్ నుండి కారులో మెహెరాబాద్‌కి బయల్దేరారు. ఐతే ఆ రోజు ఉదయం బాబా మలబద్ధకంతో బాధపడ్డారు. మెహెరాజాద్‌లో బయల్దేరాక కొద్దిదూరం రాగానే బాబా టాయ్‌లెట్‌కి వెళ్ళాలని ఏరుచ్‌తో అన్నారు. అలా అయితే దారిలో వున్న ఖుస్రూ క్వార్టర్స్‌లో వున్న ఆదీ ఇంటి దగ్గర కారు కొద్దిసేపు ఆపుతానన్నాడు ఏరుచ్. "వద్దులే". ముందుకి వెళ్ళిపోదాం అన్నారు బాబా. అలా మరికొంత దూరం వచ్చాక తిరిగి బాబా ఏరుచ్‌తో టాయిలెట్‌కి అర్జంటన్నట్లు చెప్పారు. మరైతే, బాబా ప్రేమికులున్న అక్బర్ ప్రెస్" దగ్గర కొద్దిసేపు కారు ఆపుతానని ఏరుచ్ సలహా ఇచ్చాడు. అందుకు కూడా బాబా అంగీకరించ లేదు. వేగంగా పోనియ్యి. మెహెరాబాద్‌లో నా కేబిన్‌కి వెళ్ళాక అక్కడున్న వాష్‌రూంకి వెడతానని చెప్పారు. ఎవరినీ కొద్దిసేపు లోనికి రాకుండా చూడమన్నారు. ఏరుచ్ ఎంతో వేగంగా కారు నడుపుతూ వచ్చినా, ఉదయం 7.30 నుండి బారులు తీరివున్న సహవాసీలు సుమారు మెహెరాబాద్ మెయిన్‌రోడ్డు నుండి మూడు ఫర్లాంగుల మేరకు నిలబడి బాబా కోసం వేచి వున్నారు. బాబా కారు రావడం చూసిన సహవాసీలు అవతార్

మెహెర్‌బాబాకి జై అంటూ బిగ్గరగా, మరింత బిగ్గరగా జయజయ ధ్వానాలు చేశారు. బాబావారి కారుని చుట్టుముట్టారు. బాబావారి కారుని ముందుకు పోనీయండి. అడ్డుతొలగండని ఎంత వేడుకున్నా వినేవాళ్ళు లేరనట్లు మరింత ముందుకు సహవాసీలు వచ్చారు. కారు హారను ఎంత గట్టిగా కొట్టినా వారు ఆలకించలేదు. బాబా కూడా వారికి అడ్డుచెప్పొద్దన్నారు. వాళ్ళ ఉత్సాహాన్ని నీరుకార్చొద్దన్నారు. వారికి జీవితంలో ఒకసారి ఇలాంటి అవకాశం చిక్కుతుందన్నారు. వారి ఆనందాన్ని ఆపొద్దన్నారు. దాంతో కారు అంగుళం అంగుళం చొప్పున ముందుకు కదిలింది. ప్రేమికుల అమితానందం అవతారునికి అత్యంత కష్టమైన సమయమైంది. ప్రకాషె ఛబ్రా అనే ఫిల్మ్ మేకర్ బాబా జన్మదిన వేడుకల్ని ఫిల్ము తీయడానికి ప్రత్యేకంగా డెహ్రాడూన్ నుండి సుమారు 15 మంది సాంకేతిక నిపుణులతో మెహెరాబాద్‌కి వచ్చాడు. ఆతను ఫిల్ము తీయడానికి వీలుగా సహవాసీలనందరినీ లైన్లో నిలబడేలా చేశాడు. వీరితోపాటు చాలామంది ఫోటోగ్రాఫర్‌లు కూడా వచ్చారు. మెహెరాబాద్‌లో బాబావారి కారు ముందుకు సాగుతుండగా బాబాపై పూలరేకులను మహిళా సహవాసీలు చల్లారు. బాణాసంచా పేల్చారు. ఊరేగింపుగా వెడుతున్న బాబావారి కారు వెనక్కాల సాకోరి నుండి వచ్చిన గోదావరిమాయి కారు వుంది. సుమారు ఒక గంట తర్వాత ఈ ఊరేగింపు బాబా కేబిన్ చేరింది. అప్పటిదాకా ఎంతో సహనంతో, ఓర్పుతో టాయిలెట్‌కు వెళ్ళలేక అవస్థ పడుతున్నా, బైటకు మాత్రం సహవాసీలకు చిరునవ్వులు చిందిస్తూ చిద్విలాసంగా కనిపించారు. పాటలు పాడేవారిని, కవ్వాలీలు ఆలాపించేవారిని, నృత్యం చేసేవారిని, ఇలా వారినీ వీరిని అనేమి సహవాసీలనందరినీ బాబా ఉత్సాహపరిచారు. ఈ దృశ్యాన్ని మాటల్లో వర్ణించడం కష్టమే. ఆ ఉత్సాహంలో వారు తమను తాము మైమరచిపోయారు. బాబావారి కారుకి అడ్డుగా నిలిచారు. అవతారుడు తన కడుపులో బాధను భరిస్తూనే తన ప్రేమికుల అనందంలో పాలుపంచుకున్నారు. ఉదయం 8.30 బాబావారి కారు ఆయన కాబిన్‌కు చేరుకుంది. బాబా తన వాష్‌రూంకి వెళ్ళారు. ఆ తర్వాత తన రెండు చేతి కర్రల సహాయంతో బైటకు వచ్చి, సహవాస్ వేదిక వద్దకు వెళ్ళడానికి ముందుగా ఏర్పాటు చేసిన అలంకరించిన కారు ఎక్కారు. కాకాబారియా బాబాకు కుడివైపున కూర్చున్నాడు. శత్రుఘ్నకుమార్ బాబాకు ఎండ తగలకుండా గొడుగు పట్టాడు. ఏరుచ్, మెహెర్జీ కర్కారియా తదితరులందరూ కారుకి ఇరుప్రక్కలా కారుతో సమానంగా వేగంగా నడిచారు. బాబావారి కారువైపు ఎవరూ దూసుకు రాకుండా వారు రక్షణగా నిలబడ్డారు. బైదుల్ కుమారుడు పెర్సీ ఇరానీ, ఆదీ దుబాషీ, ఇంకా చాలామంది ఊరేగింపుకు ముందుగా నడుస్తూ, కారు వెళ్ళేదారిని క్లియర్ చేశారు. తెలుగు భజన గీతాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. ఊరేగింపులో బాబావారి

కారు వెనక్కాల గోదావరిమాయి కారు వుంది. కొందరు పార్శీ మహిళలు బాబాకు సాంప్రదాయ పూర్వకంగా స్వాగతం పలికారు. ఉదయం 8.45 నిముషాల సమయంలో బాబావారి కారు సహవాస్ వేదిక సమీపించగానే, సహవాసీలను అందర్నీ లోనికి వెళ్ళివారి స్థానాల్లో కూర్చోమని ప్రకటించారు. బాబా, గోదావరిమాయి వేదికపైకి రాగానే రెట్టించిన ఉత్సాహంతో అవతార్ మెహెర్‌బాబాకి జై, గోదావరిమాయికి జై అని సహవాసీలు ఏకకంఠంతో జయజయధ్వానాలు చేశారు. ముందుగా పార్శీ స్త్రీ ప్రేమికులు అవతారునికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గుజరాతీ ప్రేమికులు కొందరు మినూ ఖరాస్ నేతృత్వంలో అవతారుడిని పూల కిరీటంతో అలంకరించారు. అనంతరం బాబాని పూలహారాలతో ముంచెత్తారు. గైమాయి జెస్సావాలా, వారి కుటుంబసభ్యులు పార్శీయుల సాంప్రదాయంలో అవతారుడిని ఆరాధించారు. కొద్దిసేపటి తర్వాత బాబా తన శిరస్సున వున్న పూల కిరీటాన్ని తీసివేశారు. వేదికపై గోదావరిమాయి బాబాకు కుడివైపున కూర్చుంది. బాబా ఆమెతో మాట్లాడుతూ, తన పాదప్రక్షాళనకు సహవాసీలలోని 12 మంది పురుషులు, మరో 12 మంది స్త్రీలకు అవకాశం ఇచ్చానన్నారు. ఐతే, అయితే ఎవరా 12 మంది అనే విషయంలో వారిలో ఏకాభిప్రాయం రాలేదు. దాంతో తన పాదాలను తాను కడుక్కుంటానని ప్రకటించానని బాబా ఆమెతో చెప్పారు. ఆ తర్వాత బాబా వేదికపై వున్న తన ఆసనం నుండి లేచి వేదిక ముందుభాగంలో ఓ ప్రక్కగా వేసివున్న సోఫాలో కూర్చున్నారు. ఆరంగాం ప్రేమికులు టోకా నుండి తెచ్చిన నదీజలాలను బాబా ప్రక్కనే వుంచిన ఒక పెద్ద రాగి గంగాళంలో పోశారు. ఆ గంగాళాన్ని బాబాకు కుడివైపున వుంచారు. విచ్చేసిన సహవాసీలలో కూడా చాలామంది ఉత్తరాదిన వున్న గంగా నది తదితర పుణ్యనదుల నుండి సీసాల్లో తెచ్చిన పుణ్యతీర్థాలను కూడా ఆ గంగాళంలో పోశారు. ఆ తర్వాత పాలు, తేనె, రోజ్‌వాటర్ వంటి సుగంధ ద్రవ్యాలను ఆ నీటితో కలిపారు. ఆ పిదప బాబా తన పాదాలను ఒక బేసిన్‌లో వుంచి, గంగాళంలో నుండి మూడు, నాలుగు మగ్గుల నీటిని తీసుకుని తన పాదాలు కడుక్కున్నారు. బాబా తన పాదప్రక్షాళన జరుగుతున్న సమయంలో కూడా భజన గీతాలాపన జరుగుతూనే వుంది. బాబా పాదప్రక్షాళనతో వచ్చిన నీటిని– “చరణామృతాన్ని” గంగాళంలో వున్న నీటితో కలిపారు. సహవాసీలందరూ అవతార్ మెహెర్‌బాబాకి జై అని జయజయధ్వానాలు చేశారు. ఆ ప్రాంగణమంతా జయజయ ధ్వానాలతో మిన్నంటింది. బాబా పాదాలను ఏరుచ్ టవల్‌తో శుభ్రపరిచాడు. ఆ తర్వాత బాబా వేదికపై వున్న తన ఆసనం దగ్గరకు వెళ్ళారు. బాబా పాదాలు పరిశుభ్రపరిచిన తువ్వాలాను సహవాసీలలో వున్న తెలుగుపెద్ద శ్రీ మొసలికంటి తిరుమలరావు గారికి బహూకరించారు. ఆయన ఆ వస్త్రాన్ని తన కళ్ళకద్దుకుని మహా ప్రసాదంగా స్వీకరించాడు. టోకా నుండి

## ముగియనున్న సీరియల్

**మెహెరాబాద్‌లో 1958 ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన సహవాస్ గురించి 2019 జనవరి నుండి ధారావాహిక సీరియల్‌గా మెహెర్‌బాబా పత్రికలో ప్రచురిస్తున్నాం. కాగా, ఈ సీరియల్ మరో మూడు నెలలో, 2021 అక్టోబరుతో ముగియనుంది.** ఈ అవతారకాలంలో మెహెర్‌బాబా ప్రేమికులకు 1955, 1958 సంవత్సరాలు చాలా ప్రత్యేకమైనవి. 1955 నవంబరు – డిశెంబరు నెలలో మెహెరాబాద్‌లో తొలిసారిగా గుజరాతీ, తెలుగు, హిందీ, మరాఠీ ప్రాంతీయులకు ప్రత్యేక సహవాస్ నిర్వహించారు. ఆ తర్వాత, 1958 ఫిబ్రవరిలో రెండవసారి మెహెరాబాద్‌లో ఈ ప్రాంతీయులకి ముఖ్యంగా మహిళల కోసం బాబా సహవాస్ నిర్వహించారు. ఐతే మహిళలతోపాటు పురుషులు కూడా ఈ సహవాస్‌లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ రెండు సహవాస్‌లలో అవతారుడు ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు సహవాసీలతో ముచ్చటించారు. అనేక విషయాలను బాబా సోదాహరణగా వివరించారు. ఈ సహవాస్ ఈ తరంవారి కోసమే కాదు, భవిష్యత్తులో తనను ప్రేమించేవారందరి కోసమని బాబా ప్రకటించారు. అంతటి మహత్తరమైన 1955లో జరిగిన మెహెరాబాద్ సహవాస్‌ని "దేవుని సన్నిధి" శీర్షికతో గ్రంథస్తం చేసి 2017 జూన్‌లో ప్రచురించడమైంది. భిన్న భాషా ప్రాంతీయులు మెహెరాబాద్ పూదోటలో చక్కగా విహరించారు. వీరందరూ పరబ్రహ్మ, పరమాత్మ, దేవ దేవుడైన అవతారుని సన్నిధిలో ఓలలాడారు. సహవాసీలందరూ ధన్యులు. ఈ సీరియల్‌పై మీ అభిప్రాయాన్ని తెలియజేయగలరు.

కావిళ్ళలో తీసుకొచ్చిన నీటిలో బాబా ఏదో మురికి పదార్థాన్ని చూశారు. దాంతో ఆ నీటిని నోట్లోకి ప్రసాదంగా త్రాగవద్దని బాబా సహవాసీలను హెచ్చరించారు. కేవలం ఆ నీటిని వారి నుదిటికి రాసుకోమని హెచ్చరించారు. ఆ తర్వాత సహవాసీలలో స్త్రీ, పురుషులందరూ వేదికపై వున్న బాబా దగ్గరకు వెళ్ళి బాబా ప్రసాదంగా ఆ నీటిని తమ దోసిళ్ళతో తీసుకున్నారు. ఆ సమయంలో కూడా ఆ జలాలను నోట్లోకి తీసుకోవద్దు. కేవలం మీ నుదిటికి రాసుకోండని బాబా హెచ్చరించారు. ఉదయం 9.20 నిముషాలకు బాబావారికి ఆరతి తెలుగు, గుజరాతీలలో ఆలాపించారు. ఆ పిదప శ్రీ మొసలికంటి తిరుమలరావు గారు తాను ఆంధ్రీకరించిన భగవద్వచనం గ్రంథాన్ని బాబా పాదాలచెంత వుంచి, ఆ పుస్తక అనువాదంపై ఆయన క్లుప్తంగా ప్రసంగించారు.

**–సశేషం**



# మౌన వార్షికోత్సవం

2021 జూలై 10న అవతారుని 96వ మౌన వార్షికోత్సవం ఒక పండుగ వాతావరణంలో జరుపుకున్నట్లు సమాచార భోగట్టా. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి, జుబ్లి బాబా కేంద్రాలలో బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో అవతారుని నామస్మరణలో మౌనం పాటించారు. ఆదిలాబాద్ నుండి శ్రీకాకుళం దాకా వున్న వందలాది బాబా ప్రేమికులు మౌనం పాటించినట్లు ఆయా కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. ఐతే, కరోనా వైరస్ నియమ నిబంధనలను అనుసరించి ప్రేమికులు ఎక్కువగా ఎక్కడివారక్కడే వారిండ్లలో వుండి మౌనం పాటించినట్లు తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాలలో ముఖ్యంగా కొవ్వూరు మెహెర్‌స్థాన్‌లో 120 మంది బాబా ప్రేమికులు అవతారుడిని దర్శించుకుని, ఆ పిదప మౌనం పాటించారని శ్రీ ఆర్ ఎన్ మూర్తి తెలిపారు. రాజమండ్రిలో 45 మంది మౌనం పాటించారని శ్రీ కె. రామకృష్ణ మెహెర్ తెలిపారు. కరీంనగర్, సాయినగర్ కేంద్రంలో బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారని శ్రీ యన్ లక్ష్మీనరసింహారావు తెలిపారు. మంచిర్యాల జిల్లా వెంకట్రావ్‌పేట కేంద్ర ప్రేమికులందరూ మౌనం పాటించారని అధ్యక్షులు శ్రీ తిప్పని దమ్మయ్య తెలిపారు. విజయనగరం జిల్లాలోని విజయనగరం, పూతికపేట, గరివిడి, సాలూరు, కొమరాడ, పార్వతీపురం, బొబ్బిలి, రాయగడ, శిఖబడి, కర్లాం, చీపురుపల్లి, పోతాయవలస, గరివిడి తదితర బాబా కేంద్రాల తరపున రమారమిన 250 మంది ప్రేమికులు అవతారుని నామస్మరణలో గడిపారని శ్రీ కొల్లి రామారావు తెలిపారు. విశాఖపట్నం,తుమ్మపాల, గాజువాక బాబా కేంద్రాలలో బాబా సాహిత్యం చదువుతూ, ఆన్‌లైన్ సహవాస్ కార్యక్రమాలు వీక్షిస్తూ బాబా నామస్మరణలో మౌనం పాటించామని శ్రీ వల్లూరి నాగేశ్వరరావు తెలిపారు. గతంలో అయితే తాము స్థానిక సింధియా బాబా కేంద్రంలో మౌనవార్షికోత్సవాన్ని ఆనందంగా జరుపుకునేవాళ్ళం అన్నారు. తుమ్మపాల కేంద్రంలో చక్కని గ్రామీణ వాతావరణంలో ప్రేమికులంతా జూలై 9 నుండి 10 అర్ధరాత్రి వరకూ స్థానిక బాబా కేంద్రంలోనే పండుగ వాతావరణంలో మౌనవార్షికోత్సవాన్ని జరుపుకున్నారని శ్రీ వల్లూరి అన్నారు. కరోనా నియమాలను పాటిస్తూ నరసరావుపేటలో మౌన వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామని శ్రీ వంకాయల అచ్యుతరావు తెలిపారు. ఇదేమాదిరి, తెలుగునాటగల అనేక బాబా కేంద్రాలలో అవతారుని మౌన వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నామని, కరోనా వైరస్ నుండి త్వరలో విముక్తి కలిగించాలని, అవతారుని దివ్యసమాధిని దర్శించుకునే భాగ్యం అతిత్వరలో ప్రసాదించమని బాబాని కోరుకున్నట్లు తెలిపారు.

# అవతారుని దివ్యప్రణాళిక

(శ్రీ రాయల రామచంద్రయ్య, ఖమ్మం)

**ఆసియన్ ట్రిబ్యూన్.కామ్ సౌజన్యంతో**

ఈ ప్రపంచంలో అనేక మతాలున్నాయి. అన్ని మతాలు సోదర భావాన్నే ప్రభోదిస్తున్నాయి. ఎవరు నమ్మినా, నమ్మకపోయినా, అంగీకరించినా, అంగీకరించక పోయినా ఏ మతం ఎవరిలోను విద్వేషాగ్ని రగిలించదనేది సత్యం. అంతేకాదు ఏ మతం కూడా అది నిర్దేశించిన సూత్రాలే నిర్వాణ పథానికి మార్గదర్శకం అని కూడా చెప్పలేదు. నేటి మత బోధకులందరూ మతాలను సంక్లిష్టంగా మార్చి ఆచార వ్యవహారాలకు, కర్మకాండలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని బాబా తీవ్రంగా ఖండించారు. దైవీప్రణాళిక గురించి వివరిస్తూ, దైవీప్రణాళికను అనుసరిస్తూనే ప్రతియుగంలో మానవాళి ఉద్దరణ కోసం భగవంతుడు ఈ భూమిపై అవతరిస్తున్నాడని బాబా అన్నారు. ఈ భూమిపై దైవీ చైతన్యముతో మానవునిగా జన్మించిన భగవంతుడే అవతార పురుషుడు. పరిణామక్రమం, జన్మలు – పునర్జన్మలు, అంతర్ముఖ ప్రయాణం వంటి చైతన్య స్థితులలో అవతారుడు ప్రయాణించడు. కానీ ఆ కాలంలో ఉన్న సద్గురువులు ఐదుగురు నిరాకార, నిర్గుణ పరబ్రహ్మను భూమిపైకి తీసుకువచ్చేటపుడు అతనిపై మాయ వంటి తెరను వేస్తారు. అలా తెర లేకుండా భగవంతుడు యధాతథంగా భుమిపైకి వచ్చినట్లైతే, ఈ వస్తు ప్రపంచంలో మాయకు – సత్యానికి మధ్య గల సమతుల్యత తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముంది. సరియైన సమయం ఆసన్నమైనప్పుడు అవతారపురుషుని చైతన్యంపై కప్పి ఉంచిన తెరను పంచ సద్గురువులు తొలగించి అవతార పురుషుడిని ఈ ప్రపంచానికి వెల్లడిస్తారు. ఆ క్షణం నుండి అవతారుడు తన అవతార కార్యక్రమాన్ని ప్రారంభిస్తాడు. అజ్ఞానంలో ఉన్న మానవునిలోని దైవాన్ని మేల్కొల్పడానికై ఈ మాయా ప్రపంచంలో అవతారుడు తన ఇష్టపూర్వకంగా అడుగుపెడతాడు. విశ్వవ్యాపకంగా ఆధ్యాత్మిక త్రోపునివ్వడమే ఆయన లక్ష్యము. మానవాళికేకాక సృష్టి యావత్తు దాని వలన లబ్ది పొందుతుంది. అవతార పురుషునికి ఆంతరంగిక శిష్యవర్గం ఉంటుంది. తన అవతారతత్వాన్ని తెలుసుకున్న మరుక్షణంలోనే శిష్యకూటమి రూపొందుతుంది. ఆ వర్గంలో 12 మంది పురుషులు, ఇద్దరు స్త్రీలు ఉంటారు. అవతారుని ఆదేశాలను అనుసరించి వారు పనిచేస్తారు. ఈ భూమిపై అవతారుని ప్రకటీకరణ జరిగిన వంద సంవత్సరములు అనగా అవతారయుగంలో ఈ ఆంతరంగిక శిష్యవర్గం అంతా భగవదనుభవం పొందుతుంది. భగవంతుడెల్లపుడు ఒక్కడే కనుక అవతార పురుషుడు కూడా ఎప్పుడూ

ఒక్కడే అని మెహెర్‌బాబా పలు సందర్భాలలో చెప్పారు. శాశ్వతుడు, అవిభాజ్యుడు, అనంతుడు అయిన ఆ భగవంతుడు తానే యెస్సయ్యగా, ప్రాఫెట్‌గా, సనాతనునిగా, ఉన్నతోన్నతునిగా ప్రకటింపబడతాడు. శాశ్వతుడైన ఆ అవతార పురుషుడే ప్రతి యుగంలో, వివిధ కాలమాన పరిస్థితులలో వివిధ మానవ రూపాలను ధరించి, వివిధ నామాలతో, వివిధ ప్రదేశాలలో సత్యాన్ని వెల్లడించడానికి వస్తాడు. మానవాళిని అజ్ఞానాంధకారం నుండి బయటపడవేసి మాయా బంధనాల నుండి విముక్తిని ప్రసాదిస్తాడు. భగవంతుడు ప్రతి యుగంలో భూమిపై తూర్పు వైపున పురుష రూపంలో అవతరిస్తాడని మెహెర్‌బాబా ప్రకటించారు. జీసస్, మహమ్మదు కూడా మధ్య – తూర్పు ప్రాంతంలో, తూర్పు ప్రాంతంలోను జన్మించినట్లు మనకు తెలుసు. అలా అవతారపురుషుడు ఎల్లప్పుడు ఆసియా ఖండంలోనే జన్మిస్తాడు. ఈ విశ్వములోని పరిణామ ప్రక్రియకు, స్థూల ప్రపంచానికి సంబంధించిన ఒక విచిత్రమైన పరిస్థితి కారణంగా అవతారుని ప్రకటీకరణ ప్రత్యేకంగా ఆసియా ఖండంలోనే జరుతుందని బాబా స్పష్టం చేశారు. అవతారకాలం సృష్టికే వసంతకాలం. ఆ కెరటాలు క్రొత్త శక్తిని విడుదల చేస్తాయి. నూతన చైతన్యాన్ని మేలు కొల్పుతాయి. జీవితాలకు క్రొత్త అనుభవాలని ఇస్తాయి. ఏ కొందరికో కాదు.అందరికి దక్కుతుంది ఈ అదృష్టం. మొత్తం జీవకోటి అంతా చైతన్యపు ఉన్నత స్థితులను పొంది క్రొత్త శక్తిని పుంజు కుంటుంది. ఇదే అవతారుని ఆధ్యాత్మిక కుదుపు. అవతార పురుషుడు సకల చరాచర సృష్టి యొక్క అవసరాలపట్ల అప్రమత్తుడై ఉంటాడు. దాని ఫలితంగా అతడు మానవాళి కొరకే కాక పరిణామక్రమంలో ఉన్న ఆత్మల కొరకు కూడా పనిచేస్తాడు.

## అవతారుని నిస్సహాయత, బాధపడుట:

భగవంతుని దివ్యత్వాన్ని సద్గురువులు మాయలోనికి ప్రవేశపెట్టగానే ఆ దైవీతత్వం భ్రాంతిలోని మూలమూలలకు ప్రవేశిస్తుంది. స్థూల, సూక్ష్మ, మానసిక చైతన్యములోని లెక్కలేని రూపాలకు అచైతన్యం ప్రసరిస్తుంది. అందువలన అవతారపురుషుడు మానవునిలో మానవునివలె కలగలిసి పోతాడు. భగవంతుడు మానవునిగా అవతరించినపుడు విశ్వవ్యధను, నిస్సహాయతను అనుభవిస్తాడు. ఎందుకంటే మానవుని బాధ, నిస్సహాయత అనే అజ్ఞానం నుండి విముక్తి ప్రసాదించడానికి, అనంతశక్తి కలిగి ఉండి కూడా అవతారుడు నిస్సహాయతను, అవమానాన్ని భరిస్తాడు. అవతారుడు తన అనంతశక్తిని వినియోగించినట్లైతే నిస్సహాయతను ఎలా అనుభవించగలడు? ఆయన తన అనంత ఆనందాన్ని వినియోగించినట్లయితే బాధను ఎలా అనుభవించ గలడు? అందువలన అతడు తన అనంత ఆనందాన్ని కాని, అనంత శక్తినిగాని ఉపయోగించడు. తన సృష్టి పట్ల ఆయనకున్న కరుణ, ప్రేమ అటువంటిది.

అవతార పురుషుడు వివిధ నామరూపాలలో, వివిధ రూపాలలో, వివిధ కాలాలలో భూమిపై జీవిస్తాడు. అవి మానవుని యొక్క ఆధ్యాత్మిక పునరుజ్జీవన కాలముతో ఏకీభవిస్తుంది. ఆయన ప్రకటీకరణ, మానవుని జనన మరణ వేదన ఏకకాలంలో సంభవిస్తాయి. భగవద్గీతలో చెప్పినట్లుగా ఈ సమయంలో మానవుడు కోరికలకు బానిస అవుతాడు. దురాశకు వశమవుతాడు. భయం గుప్పెట్లో నలిగిపోతాడు. క్రోధంతో ఉగ్రుడవుతాడు. బలహీనులపై బలవంతులు అధికారం చెలాయిస్తారు. బీదవారిని ధనవంతులు అణచివేస్తారు. కొద్దిమంది అధికారులు తమ లాభం కొరకు సామాన్యులను మోసగిస్తారు. శాంతి కరువవుతుంది. విశ్రాంతి ఉండదు. తనను తాను మరచి పోవాలనుకుంటారు. మరణాలు పెరిగిపోతాయి. నేరాలు అధికమవుతాయి. మతం అపహాస్యం పాలవుతుంది. సంఘంలో లంచగొండితనం విశృంఖలమౌతుంది. భిన్న వర్గాల మధ్య, దేశాల మధ్య విద్వేషాలు పెరిగిపోతాయి. యుద్ధాలు చెలరేగుతాయి. మానవాళి నిరాశలో కృంగి పోతుంది. వినాశనం తప్పని సరి అవుతుంది. ఈ సమయంలో పరిస్థితి పరిపక్వస్థితికి చేరినపుడు అవతారపురుషుడు జన్మిస్తాడు. మానవుడు తానేమిటో, తానేమై ఉన్నాడో బేరీజు వేసుకునేందుకు భగవంతుడు కొలమానమవుతాడు. ఆయన తన జీవితంలో ప్రామాణికమైన మానవ విలువలను ఆచరించి చూపిస్తాడు. గతంలోని ఏడు అవతారములు – జొరాతుస్త్ర, రాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, జోరాస్టర్, జీసస్, మహమ్మద్, ఈ అవతార కాలంలో మెహెర్‌బాబాగా అవతరించాడు. జొరాస్టరు – సుమారు 6000 సంవత్సరముల క్రితము ఇప్పుడు ఇరాన్‌గా పిలువబడుతున్న దేశంలో జన్మించాడు. మానవాళి ధైర్యము లేక దైన్యస్థితిలో ఉండేవారు. పర్షియా దేశవాసులు అటు పూర్తిగా భౌతిక వాదులుకారు, ఇటు ఆధ్యాత్మికత వైపు ఆకర్షితులైనవారూ కాదు. జోరాష్టరు ఆనాటి మానవులకు వివాహం చేసుకొని మంచి గృహస్థులుగా జీవించమని బోధించాడు. ఇతరుల భార్యల పట్ల వ్యామోహం లేకుండా భగవంతుని ఆరాధించమని ఉపదేశించాడు. అతడు స్వయంగా మంచి ఆలోచనలు, మంచి మాటలు, మంచి చేతలు, ఆచరించి చూపించాడు. అతడు వివాహము చేసుకొన్నాడు. అతని జీవితము గురించి, అతని బోధలు గురించి పూర్తి ఆధారాలు లేవు. ఆవు చర్మముపై వ్రాసిన ఆనాటి విశేషాలన్నీ ఆనాటి రాజుల దురాక్రమణలో నశించి పోయాయి. శ్రీరాముడు – భారతదేశంలో జీవించాడు. అతని తండ్రి అయోధ్యను పాలించాడు. రాముని జనన సమయములో ఋషులు, మునులు రాక్షసులచే పీడింపబడినట్లు రామాయణం చెబుతుంది. సాధుజనుల మొర విన్న శ్రీ మహావిష్ణువు మానవరూపంలో శ్రీరాముడిగా వచ్చి రాక్షస సంహారం చేశాడు. రామరాజ్యంగా నేటకీ పిలువబడుతున్న ఆ కాలంలో ప్రజలు సుసంపన్నులై ప్రశాంతంగా జీవించారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు

తనను అవతారునిగా ప్రకటించుకున్నాడు. ఆయన స్వయంగా ప్రవచించిన "భగవద్గీత" నేటికీ ఆచరణీయం. కృష్ణావతారకాలంలో ఈర్ష్య, అసూయలు ఆధిక్యతలో ఉండేవి. ప్రేమ, నిజమైన ఆధ్యాత్మిక జీవితం గురించిన అవగాహన లేదు. కృష్ణుడు, ప్రేమ, స్వచ్ఛత, అమాయకత్వం ఆధారంగా బోధించాడు. నిస్వార్థ ప్రేమ దిశలో మానవులను నడిపించాడు. **గౌతమ బుద్ధుడు –** సుమారు 560 బి.సి.లో శాక్య రాజైన శుద్ధోధనునకు జన్మించాడు. ఆ కాలంలో ప్రజలు భౌతిక విషయాలలో పూర్తిగా మునిగియున్నారు. మాయ వలలో చిక్కుకున్న మానవులకు నిజమైన జీవిత విలువలను బుద్ధుడు బోధించాడు. జీసస్ – జన్మించిన రోజులలో మానవులలో అహంకారము, క్రూరత్వం, గర్వం ముఖ్య లక్షణాలుగా ఉండేవి. జీసస్ నిరాడంబరంగా వినయంతో నిరుపేదగా జీవించాడు. ప్రియతముడైన భగవంతునిపట్ల పరిశుద్ధ హృదయంతో ప్రేమను ప్రజలకు భోధిస్తూ వారి కొరకు బాధలను భరించాడు. **మహమ్మదు** – ప్రవక్తగా మానవుల మధ్య అరేబియా దేశంలో జన్మించి తన బోధనలతో ఎందరినో సత్యమార్గం వైపు ఆకర్షించాడు. మెహెర్‌బాబా మనదేశంలోని పూణేలో 1894 ఫిబ్రవరి 25వ తేదీన పార్శీ దంపతులకు జన్మించాడు. పంచ సద్గురువులైన బాబాజాన్ ద్వారా అనంత ఆనందము, షిర్డీసాయి బాబా ద్వారా అనంత శక్తి, ఉపాసనీ మహరాజ్ ద్వారా అనంత జ్ఞానాన్ని మేర్వాన్ పొందాడు. తాను భగవంతునిగా ఎరుక కలిగిన తర్వాత మేర్వాన్‌ని ఈ స్థూల ప్రపంచంలోని తీసుకురావడంలో నారాయణ మహరాజ్, తాజుద్దీన్ బాబా ప్రత్యక్షపాత్ర వహించారు. మెహెర్‌బాబా సందేశము అతి సులభమైనది. సూటిగా అర్థమవుతుంది. ఆయన "నేను మేల్గొల్పుటకే కాని బోధించుటకు రాలేదు. ఈనాటి మానవాళికి కావలసింది మతాలు, వర్గాలు కాదు. ప్రేమ కావాలి. దివ్యప్రేమ ద్వేషాన్ని, భయాన్ని జయిస్తుంది. ఆ ప్రేమ దేనిమీద ఆధారపడదు". "ఈ దివ్య ప్రేమను మానవునిలో మేల్కొల్పడానికై నేను వచ్చాను. తద్వారా అనంతమైన శాశ్వత సంపద సొంతమౌతుంది. అన్ని సమస్యలను పరిష్కరిస్తుంది". "మీ హృదయాలలో ఈ ప్రేమ బీజాన్ని నాటడానికే మీ మధ్యకు వచ్చాను. ఈ భ్రాంతిమయ జీవితంలోని పైకి కనిపించే వేర్పాటు భావనను దూరంచేస్తుంది" భగవంతుని ఎలా ప్రేమించాలో వివరిస్తూ బాబా ఇలా అన్నారు. ఇతరులలోని లోపాలను ఎంచకుండా మన లోపాలను గుర్తించగలిగితే భగవంతుని ప్రేమించినట్లే అన్నారు. ఇతరులను దోచుకోవడం కాకుండా ఇతరులకొరకు మనలను మనం దోచి ఇచ్చినట్లైతే , ఇతరుల బాధలోని బాధానుభవాన్ని, ఇతరుల సంతోషంలోని ఆనందాన్ని పంచుకున్నట్లయితే, భగవంతుని ఇచ్ఛననుసరించి సహనంతో సంతృప్తిగా జీవించినట్లయితే, అలాగే, ఈ సృష్టిలోని ఏ జీవికి హాని తలపెట్టక పోవడం ద్వారా మనం భగవంతుని ప్రేమించినట్లేనని బాబా స్పష్టం చేశారు. ప్రతియుగంలోను ప్రతి అవతార పురుషుని ద్వారా ఈ సత్యాన్నే వింటుంటాం. ఎందుకంటే సత్యం ఒక్కటే.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమున గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు
అల్లాహ్,
ఇలాహీ,
యజ్దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2021 మే నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|
| 1. | శ్రీ ఎస్. వెంకటేశ్వర్ రావు, ఖమ్మం | రూ. 1000/- |
| 2. | శ్రీ జి. సత్తయ్య, హైదరాబాద్ | రూ. 1000/- |
| 3. | శ్రీ బొప్పు రాజన్న, వెంకట్‌రావుపేట, మంచిర్యాల జిల్లా | రూ. 500/- |
| | మొత్తం | **రూ. 2500/-** |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.


**మా అడ్రస్:**

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087. ఫోన్: **99595-53218.**
**email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**